సమగ్ర సమాచార పత్రిక

ముద్ర

www.mudranews.in

హైదరాబాద్
శుక్రవారం, 06.11.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:13 సంచిక: 365
పేజీలు: 08 వెల: రూ. 5

మోదీ దేశద్రోహి

ఐదు నిమిషాల్లో నిరూపిస్తా: రాహుల్ గాంధీ




- ట్రంప్ చేతిలో మోదీ.. ప్రధానికి రాహుల్ గాంధీ సవాల్
- ఏడాదిలోపే కేంద్ర ప్రభుత్వం కూలిపోతుంది
- అదానీ పోర్టులో డ్రగ్స్ పట్టుబడితే ఏం చేశారు? అమిత్ షాకు ప్రశ్న
- పార్లమెంటులో నా మైక్ కట్ చేస్తున్నారు..
- రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు

సమస్యల పరిష్కారంలో జాప్యం వద్దు

- మృతి చెందిన జర్నలిస్టుల కుటుంబాలకు రూ.5 లక్షల సాయం అందించాలి
- జర్నలిస్టుల కుటుంబాల నెలసరి పెన్షన్ రూ.10 వేలకు పెంచాలి
- జర్నలిస్టుల హెల్త్ కార్డులు వెంటనే జారీ చేయాలి..
- ప్రభుత్వానికి టీయూడబ్ల్యూజే కార్యవర్గ సమావేశం విజ్ఞప్తి

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డుల సమస్యలను పరిష్కరించాలి




కాంగ్రెస్ సీఎంలకు అవమానాలా?

ఇద్దరు కాంగ్రెస్ సీఎంలకు చేదు అనుభవం

రేవంత్, డీకేలను పక్కకు నెట్టిన సెక్యూరిటీ

- కాంగ్రెస్‌కు తలనొప్పిగా మారిన వైరల్ వీడియోలు
- హైకమాండ్‌పై బీజేపీ, బీఆర్ఎస్ విమర్శల దాడి
- సీఎంలకు గౌరవం లేదా అంటూ విపక్షాల ప్రశ్న
- రాహుల్, ప్రియాంక ర్యాలీల్లో ఊహించని పరిణామాలు
- సోషల్ మీడియాలో కాంగ్రెస్‌పై నెగెటివ్ ప్రచారం
- డీకే వివరణతోనూ ఆగని రాజకీయ రచ్చ
- సొంత సీఎంల గౌరవం కాపాడుకోవాల్సిన హైకమాండ్



ముద్ర, తెలంగాణ బ్యూరో:
ఢిల్లీ వేదికగా కాంగ్రెస్ అగ్రనేతలకు చేదు అనుభవాలు.. రాహుల్, ప్రియాంకల ర్యాలీల్లో ఇద్దరు సీఎంలకు ఎదురైన ఘటనలపై రాజకీయ దుమారం.. కావాలని అవమానించారంటూ బీజేపీ, బీఆర్ఎస్ విమర్శలు.. భద్రతా ప్రోటోకాల్స్‌లో భాగమేనంటున్న కాంగ్రెస్ వర్గాలు.


కాంగ్రెస్ పార్టీలో కీలక పదవుల్లో ఉన్న ఇద్దరు ముఖ్యమంత్రులకు ఢిల్లీ వేదికగా ఎదురైన పరిణామాలు ఇప్పుడు రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి. కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిలను రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ పాల్గొన్న కార్యక్రమాల్లో భద్రతా సిబ్బంది పక్కకు నెట్టివేసిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీంతో కాంగ్రెస్ అధిష్ఠానం తమ సొంత రాష్ట్రాల ముఖ్యమంత్రులకు కనీస గౌరవం ఇవ్వడం లేదంటూ బీజేపీ, బీఆర్ఎస్ విమర్శలకు దిగాయి.

ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించిన 'ఓట్ బచావో.. దేశ్ బచావో' నిరసన కార్యక్రమంలో ప్రియాంకా గాంధీ వెనుక వస్తున్న సీఎం రేవంత్ రెడ్డిని భద్రతా సిబ్బంది వెనక్కి నెట్టినట్లు కనిపించిన దృశ్యాలు చర్చకు దారితీశాయి. అంతకుముందు ఢిల్లీ మార్చ్ సందర్భంగా డీకే శివకుమార్‌కు కూడా ఇలాంటి అనుభవమే ఎదురైంది. ఈ ఘటనలను చూపిస్తూ హైకమాండ్ ప్రాంతీయ నాయకులను అవమానిస్తోందని మిగతా 02లో

రేషన్ బియ్యానికి బ్రాండెడ్ ముసుగు

- రేషన్ బియ్యాన్ని సన్నబియ్యంగా మార్చి దందా
- మంచాల, ఇబ్రహీంపట్నం మండలాల్లో విజిలెన్స్, సివిల్ సప్లయ్ అధికారుల మెరుపు దాడులు..
- మూడు రైస్ మిల్లుల్లో భారీగా అక్రమ నిల్వలు స్వాధీనం
- సూపర్ మార్కెట్లకు అక్రమంగా రేషన్ బియ్యం సరఫరా
- అనుమతులు లేకుండానే రైస్ మిల్లుల నిర్వహణ
- మిల్లర్లు, వ్యాపారులపై అధికారుల లోతైన విచారణ

19 బ్రాండ్ల పేర్లతో అక్రమ విక్రయాలు



ముద్ర, రంగారెడ్డి:
పేదల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యంపై అక్రమార్కులు కన్నేశారు. పేదలకు అందాల్సిన పీడీఎస్ బియ్యాన్ని పక్కదారి పట్టించి, వాటిని మిల్లుల్లో పాలిష్ చేసి సన్నబియ్యంగా మార్చి, ప్రముఖ బ్రాండ్ల పేర్లతో మార్కెట్లో విక్రయిస్తున్న భారీ అక్రమ దందా రంగారెడ్డి జిల్లాలో వెలుగుచూసింది. ఏకంగా 19 రకాల బ్రాండెడ్ లేబుళ్లతో ఈ బియ్యాన్ని ప్యాకింగ్ చేసి సూపర్ మార్కెట్లు, ఇతర స్టోర్లకు సరఫరా చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు.

జిల్లాలోని మంచాల, ఇబ్రహీంపట్నం మండలాల పరిధిలోని రైస్ మిల్లులు, గోదాములపై విజిలెన్స్, సివిల్ సప్లయ్ అధికారులు సంయుక్తంగా ఆకస్మిక దాడులు నిర్వహించారు. సివిల్ సప్లైస్ ఎన్ఫోర్స్‌మెంట్ ఎస్పీ రాంకుమార్ నేతృత్వంలో నాలుగు ప్రత్యేక బృందాలు ఏక కాలంలో మూడు రైస్ మిల్లులు, వాటి గోదాముల్లో తనిఖీలు చేపట్టాయి. ఈ సందర్భంగా క్వింటాళ్ల కొద్దీ అక్రమ రేషన్ బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కనీస అనుమతులు లేకుండానే కొన్ని మిల్లులు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ వెల్లడించారు.

19 బ్రాండ్ల ముసుగులో దందా!

ఈ అక్రమ వ్యాపారంలో రేషన్ బియ్యాన్ని ముందుగా సేకరించి, మిల్లుల్లో పాలిష్ చేసి నాణ్యమైన సన్నబియ్యంలా తయారు చేస్తున్నట్లు అధికారుల విచారణలో వెల్లడైంది. అనంతరం ఆకర్షణీయమైన ప్యాకింగ్‌తో ప్రముఖ బ్రాండ్ల పేర్లు తగిలించి మార్కెట్లో మిగతా 02లో

రెస్క్యూ సక్సెస్

అంతా సేఫ్

బేతుపల్లి చెరువులో రెస్క్యూ ఆపరేషన్ సక్సెస్

- మత్స్యకారులు సహా ఎస్ఆర్ఎఫ్ సిబ్బంది అందరూ సురక్షితం
- నీటి ఉధృతికి కొట్టుకుపోయిన రెండు రెస్క్యూ బోట్లు
- మరో బోటుతో రంగంలోకి దిగి అందరిని కాపాడిన సిబ్బంది
- ఊపిరి పీల్చుకున్న అధికారులు, బాధిత కుటుంబాలు

2



'ఆర్ఆర్ ట్యాక్స్' నిజమైతే చర్యలేవి?

మోదీ, షాలకు కేటీఆర్ ప్రశ్న



- ఆర్ఆర్ ట్యాక్స్‌పై కేటీఆర్ మరోసారి విమర్శలు
- చదరపు అడుగుకు రూ.200 వసూలు చేస్తున్నారని ఆరోపణ
- విమర్శలు చేస్తున్న కేంద్రం చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్న
- బీజేపీ-కాంగ్రెస్ మధ్య అవగాహన ఉందని ఆరోపణ

2

ముగిసిన పోలింగ్

ఎంపీటీసీ, జడ్పీటీసీ పోలింగ్ లో 65-68 శాతం ఓటింగ్ నమోదైనట్లు అంచనా



- భారీ వర్షా లను లెక్కచేయకుండా ఓటు వేసేందుకు తరలివచ్చిన గ్రామీణ ఓటర్లు
- పలు జిల్లాల్లో ఎన్డీయే, వైసీపీ వర్గాల మధ్య ఘర్షణలు.. పోలీసుల లాఠీచార్జ్
- స్ట్రాంగ్ రూమ్‌లకు బ్యాలెట్ బాక్సులు.. నవంబర్ 7న ఓట్ల లెక్కింపు

2

24 గంటలు దాటితే విడుదల చేయాల్సిందే

అదుపులోకి తీసుకున్నప్పటి నుంచే లెక్కించాలి

అరెస్ట్ పై పోలీసులకు సుప్రీంకోర్టు కీలక సూచన!

ప్రయాణ సమయాన్ని మినహాయించాలని సూచన

గడువు దాటితే విడుదల చేయాలని స్పష్టీకరణ

అసలు నిర్బంధ సమయాన్ని మేజిస్ట్రేట్ నమోదు చేయాలని సూచన

ముద్ర, న్యూఢిల్లీ:
అరెస్టు చేసిన వ్యక్తిని 24 గంటల్లోగా మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచాలన్న రాజ్యాంగ నిబంధనపై సుప్రీంకోర్టు కీలక వివరణ ఇచ్చింది. పోలీసులు అధికారికంగా అరెస్టు నమోదు చేసిన సమయం నుంచి కాకుండా.. వాస్తవంగా నిర్బంధించిన క్షణం నుంచే లెక్కించాలని స్పష్టం చేసింది. ఒక వ్యక్తి స్వేచ్ఛకు భంగం కలిగించి అదుపులోకి తీసుకున్న సమయమే ఈ గడువుకు ప్రాతిపదిక అని తేల్చిచెప్పింది.




త్రిపురలో ఎన్‌డీపీఎస్ చట్టం కింద నమోదైన కేసులో బెయిల్ నిరాకరిస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ నలుగురు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ కీలక తీర్పు వెలువరించింది. జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ అతుల్ చందుర్కర్‌లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు స్పష్టత ఇచ్చింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 22(2) ప్రకారం అరెస్టయిన వ్యక్తిని ప్రయాణానికి అవసరమైన సమయాన్ని మినహాయించి 24 గంటల్లోగా సమీప మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచాలి. మేజిస్ట్రేట్ అనుమతి లేకుండా అంతకుమించి నిర్బంధంలో ఉంచడానికి వీల్లేదు. మిగతా 02లో

ఇందిరమ్మ ఇంట్లో సీఎం దీపావళి

- పేదలతో పండుగ చేసుకోనున్న రేవంత్
- ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయికి వెళ్లాల్సిందే!
- సీఎం కొత్త ఆలోచన



ఇదీ AI ముద్ర



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in | @mudranews
శుక్రవారం, 06 నవంబర్, 2026

ఆలివ్ ఆయిల్‌తో గుండెకు రక్షణ!

ఆలివ్ ఆయిల్‌లో మోనో అన్‌శాచురేటెడ్ కొవ్వులు ఉంటాయి. ఎక్స్‌ట్రా వర్జిన్ ఆలివ్ ఆయిల్‌లో యాంటీఆక్సిడెంట్లు కూడా లభిస్తాయి. సలాడ్లు, తక్కువ మంటపై వండే వంటకాల్లో దీనిని ఉపయోగించడం మంచిది.



కాంగ్రెస్ సీఎంలకు అవమానాలా?

(మొదటి పేజీ తరువాయి)

ప్రచారం చేస్తున్నాయి. ఈ ఘటనలు ఉద్దేశపూర్వకంగా జరిగిన అవమానాలు కావని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. భారీ ర్యాలీల్లో జనసందోహాన్ని నియంత్రించే క్రమంలో భద్రతా సిబ్బంది ప్రోటోకాల్స్ ప్రకారం వ్యవహరించారని వివరిస్తున్నాయి. డీకే శివకుమార్ సైతం తనను ఎవరూ కావాలని నెట్టలేదని, రద్దీ కారణంగా రాహుల్ గాంధీ తనను సురక్షితంగా వాహనం ఎక్కాలని సూచించారని స్పష్టం చేశారు.

అయినప్పటికీ ఈ ఘటనలు కాంగ్రెస్‌కు రాజకీయంగా ఇబ్బందికరంగా మారాయి. ముఖ్యంగా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన ముఖ్యమంత్రులకు జాతీయ స్థాయి కార్యక్రమాల్లో తగిన గౌరవం, ప్రాధాన్యత ఇవ్వడం లేదనే ప్రచారం ఊపందుకుంది. మొత్తంగా ఇవి భద్రతా సిబ్బంది అతిజాగ్రత్త వల్ల జరిగిన యాదృచ్ఛిక ఘటనలా? లేక కాంగ్రెస్ నాయకత్వం ప్రొటోకాల్ విషయంలో మరింత జాగ్రత్త పడాల్సిన అవసరం ఉందా? అన్న చర్చ కొనసాగుతోంది.

రేషన్ బియ్యానికి బ్రాండెడ్ ముసుగు

(మొదటి పేజీ తరువాయి)

విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఎస్ఎస్, జేఎస్ఆర్, ఎస్జేఎల్, కౌ బ్రాండ్, కర్నూల్, ఫైవ్ స్టార్, ముబారక్, విజిఆర్, ఆర్ఆర్ఐ, బెస్ట్ హెచ్ఎంటీ, టమాటో గోల్డ్, గజరాజ్, సూర్య తేజ, జోకర్స్, అన్నపూర్ణ తదితర బ్రాండ్ల పేర్లతో ఈ బియ్యం విక్రయాలు సాగుతున్నట్లు తనిఖీల్లో తేలింది.

సూపర్ మార్కెట్లకు సరఫరా?

పేదలకు ఉచితంగా లేదా సబ్సిడీపై అందాల్సిన బియ్యం ఇలా అక్రమార్కుల చేతుల్లోకి వెళ్లి, పాలిష్ అనంతరం బ్రాండెడ్ బియ్యంగా మారి మార్కెట్లోకి చేరుతుండటం కలకలం రేపుతోంది. ఈ బియ్యాన్ని ప్రముఖ సూపర్ మార్కెట్లు, స్టోర్లకు తరలిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. అయితే ఈ సరఫరా వ్యవస్థలో ఎవరెవరి పాత్ర ఉంది? ఎక్కడి నుంచి రేషన్ బియ్యం సేకరిస్తున్నారు? ఏయే ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు? అనే కోణాల్లో విచారణ కొనసాగుతోంది.

మిల్లర్లు, వ్యాపారులపై నిఘా

దాడుల్లో లభించిన బియ్యం నిల్వలు, ప్యాకింగ్ సామగ్రి, బ్రాండెడ్ లేబుళ్లను అధికారులు పరిశీలిస్తున్నారు. రైస్ మిల్లర్లు, వ్యాపారుల పాత్రపై విజిలెన్స్, ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు లోతైన విచారణ చేపట్టారు. ఈ అక్రమ దందా వెనుక మరికొందరు కీలక వ్యక్తులు ఉన్నారా? రేషన్ బియ్యం సేకరణ నుంచి బ్రాండెడ్ ప్యాకింగ్, మార్కెటింగ్ వరకు ఏ స్థాయిలో నెట్‌వర్క్ పనిచేస్తోంది? అన్నది తేలాల్సి ఉంది.

ఒకవైపు పేదలకు అందాల్సిన రేషన్ బియ్యం పక్కదారి పడుతుండగా, మరోవైపు మార్కెట్లో సన్నబియ్యం ధరలు పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ప్రభుత్వ పంపిణీ వ్యవస్థలోని లోపాలను ఆసరాగా చేసుకుని సాగుతున్న ఈ అక్రమ వ్యాపారంపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

24 గంటలు దాటితే విడుదల చేయాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

సోదాలు, స్వాధీనం ప్రక్రియ పూర్తయ్యాక పోలీసులు అధికారికంగా అరెస్టు నమోదు చేసినప్పటి నుంచే 24 గంటల గడువు ప్రారంభమవుతుందని భావించడం చట్టవిరుద్ధమే కాకుండా రాజ్యాంగ విరుద్ధమని ధర్మాసనం వ్యాఖ్యానించింది. వాస్తవంగా నిర్బంధించిన సమయం నుంచి 24 గంటలు దాటినా మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచకపోతే సంబంధిత వ్యక్తిని వెంటనే విడుదల చేయాలని సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ గడువును లెక్కించేటప్పుడు అరెస్టు చేసిన ప్రాంతం నుంచి మేజిస్ట్రేట్ కోర్టుకు చేరుకోవడానికి పట్టే ప్రయాణ సమయాన్ని మాత్రమే మినహాయించాలని స్పష్టం చేసింది. అంతేకాదు, 24 గంటల్లోగా కోర్టు ఎదుట హాజరుపరిచినంత మాత్రాన నిర్బంధం చట్టబద్ధమైనట్లు కాదని ధర్మాసనం తెలిపింది. భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్)లోని సెక్షన్ 58 ప్రకారం.. కేసు పరిస్థితులకు అనుగుణంగా నిర్బంధ సమయం సహేతుకంగా ఉండేలా దర్యాప్తు సంస్థలు చూసుకోవాలని పేర్కొంది. నిందితుడిని తమ ఎదుట హాజరుపరిచినప్పుడు అతడి స్వేచ్ఛకు భంగం కలిగించిన అసలు తేదీ, సమయాన్ని మేజిస్ట్రేట్ నమోదు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. రాజ్యాంగం నిర్దేశించిన 24 గంటల గడువు పాటించారా? లేదా? అన్నది స్వతంత్రంగా పరిశీలించాలని సూచించింది. నిర్బంధం సహేతుకమైన సమయాన్ని మించిందని భావిస్తే తదుపరి రిమాండ్‌కు నిరాకరించే అధికారం మేజిస్ట్రేట్‌కు ఉంటుందని స్పష్టం చేసింది.

మోదీ దేశద్రోహి



ముద్ర, న్యూఢిల్లీ:

కేంద్రంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ప్రధాని మోదీ 'దేశద్రోహి' అని, ఆయన్ను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నియంత్రిస్తున్నారని, తనతో చర్చకు వస్తే ఆ విషయాన్ని 5 నిమిషాల్లో నిరూపిస్తానని పేర్కొన్నారు. ఈ అంశంపై చర్చకు రావాలని ప్రధానికి సవాల్ విసిరితే పార్లమెంటులో చర్చిద్దామని ఎన్డీయే నేతలు అంటున్నారని చెప్పారు. కానీ లోక్‌సభలో తాను మాట్లాడకుండా మైక్ కట్ చేస్తారని రాహుల్ తెలిపారు. దేశంలో మాదకద్రవ్యాల నిర్మూలనకు షా మూడేళ్ల గడువు పెట్టారని, అయితే అప్పటికి ఆయన ఆ పదవిలో ఉంటారో? లేదో? అని ఎద్దేవా చేశారు. తన అంచనా ప్రకారం ఏడాదిలోపే ప్రభుత్వం కూలిపోతుందని కీలక వ్యాఖ్యలు చేశారు. పంజాబ్‌లోని సంగ్రూర్‌లో బుధవారం జరిగిన ఇన్సాఫ్ ర్యాలీలో రాహుల్ మాట్లాడారు.. ''నేను అమిత్ షాను ఒక్కటే అడగాలనుకుంటున్నా. అదానీ ఓడరేవులో పట్టుబడిన మాదకద్రవ్యాల సంగతేంటి? ఆ విషయంలో మీరు తీసుకున్న చర్యలేమిటి? మీరు శాంతిభద్రతల గురించి మాట్లాడుతున్నారు. మీరు గ్యాంగ్‌స్టర్లను ప్రోత్సహిస్తున్నారని దేశం మొత్తానికి తెలుసు. ఒకవేళ మీరు శాంతిభద్రతల గురించి మాట్లాడాలనుకుంటే, మణిపుర్‌లో ఏం జరుగుతుందో దేశానికి చెప్పండి'' అని రాహుల్ అన్నారు.



ఏపీలో ముగిసిన పోలింగ్

ముద్ర, అమరావతి:

ఆంధ్రప్రదేశ్ ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల సమరం ముగిసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ ప్రక్రియ సాయంత్రం 5 గంటలకు ముగిసింది. ఐదు గంటల సమయానికి క్యూలైన్లలో ఉన్న ఓటర్లకు అధికారులు ఓటు వేసే అవకాశం కల్పించారు. రాష్ట్ర వ్యాప్తంగా 582 జడ్పీటీసీ, 7,767 ఎంపీటీసీ స్థానాలకు ఈ ఓటింగ్ జరిగింది. ఉదయం నుంచి వాతావరణం అనుకూలించక పలు జిల్లాల్లో కురిసిన భారీ వర్షాలు, మధ్యాహ్నం వరకు నెమ్మదించిన ఓటింగ్ శాతం తర్వాత ఊపందుకున్నాయి. సాయంత్రం 5 గంటలకు అధికారిక ప్రకటన వెలువడే సమయానికి గ్రామీణ ఏపీ వ్యాప్తంగా సుమారు 65% నుంచి 68% మధ్య పోలింగ్ నమోదై ఉంటుందని ప్రాథమిక సమాచారం ఆధారంగా అంచనా వేస్తున్నారు.

ఉదయం 11 గంటల సమయానికి 21.12% గా ఉన్న పోలింగ్ శాతం, మధ్యాహ్నం ఒంటి గంట దాటేసరికి 35% నుండి 50% వరకు పెరిగింది. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో గ్రామీణ ఓటర్లు బూత్‌ల వైపు అడుగులు వేశారు. ముఖ్యంగా రాయలసీమ, కోస్తాంధ్ర జిల్లాలైన మార్కాపురం , తిరుపతి, బాపట్ల, ఉమ్మడి గుంటూరు, పల్నాడు జిల్లాల్లో అత్యధికంగా ఓటింగ్ నమోదైనట్లు తెలుస్తోంది. వర్షం ప్రభావిత తీరప్రాంతాలు, కొండప్రాంతాలు కలిగిన అల్లూరి సీతారామరాజు జిల్లా వంటి చోట్ల ఓటింగ్ శాతం కాస్త తక్కువగా రికార్డయింది. గ్రామీణ ప్రాంతాల్లో తమ సొంత నేతలను ఎన్నుకోవాలనే కుతూహలంతో ఓటర్లు తరలిరావడం పోలింగ్ శాతం పెరగడానికి కారణమైంది.

అయితే, ఈ ఎన్నికల ప్రక్రియ అంతా ప్రశాంతంగా సాగలేదు. పలు జిల్లాల్లో అధికార ఎన్డీయే కూటమి, విపక్ష వైఎస్సార్‌సీపీ వర్గాల మధ్య తీవ్ర ఘర్షణలు చోటుచేసుకున్నాయి. పల్నాడు, అనంతపురం, చంద్రగిరి, ఎన్టీఆర్ జిల్లాల పరిధిలోని పలు కేంద్రాల్లో రీగ్గింగ్, నకిలీ ఓట్ల ఆరోపణలతో ఇరువర్గాలు కర్రలు, రాళ్లతో దాడులకు తెగబడ్డాయి. పొలిటికల్ ప్రాబల్యం చూపించేందుకు జరిగిన ప్రయత్నాలలో కొన్ని బూత్‌ల వద్ద ఉద్రిక్తతలు చోటు చేసుకోగా, పోలీసులు లాఠీఛార్జ్ చేసి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

పోలింగ్ ముగియడంతో 31,460 పోలింగ్ కేంద్రాలలో ఉన్న బ్యాలెట్ పెట్టెలకు అధికారులు ఏజెంట్ల సమక్షంలో పకడ్బందీగా సీళ్ళు వేశారు. ఈ బ్యాలెట్ బాక్సులను రెవెన్యూ, పోలీస్ నిఘా నీడలో సాయంత్రానికి స్ట్రాంగ్ రూమ్‌లకు తరలిస్తున్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా వెబ్‌కాస్టింగ్ ద్వారా నమోదు చేసిన విజువల్స్‌ను విశ్లేషిస్తోంది. ఎక్కడైనా బ్యాలెట్ పేపర్లు చిరగడం, బాక్సులు ధ్వంసం కావడం లేదా ఘర్షణల వల్ల పోలింగ్ పూర్తిగా నిలిచిపోయిన స్థానాలు ఉంటే, శుక్రవారం నవంబర్ 6న అక్కడ రీ-పోలింగ్ నిర్వహించే అవకాశం ఉందని SEC వర్గాలు తెలిపాయి.

ఇటీవలే ముగిసిన పురపాలక పోరులో ఎన్డీయే కూటమి అఖండ విజయం సాధించిన వేళ, గ్రామీణ ప్రాంతాల్లో ఏ పార్టీ జెండా ఎగురుతుందనేది ఆసక్తికరంగా మారింది. ఈ పోలింగ్ ప్రక్రియ అంతా ముగియడంతో అందరి దృష్టి నవంబర్ 7న జరగబోయే ఓట్ల లెక్కింపుపైనే నెలకొంది. ఆ రోజే జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థుల జాతకాలు తేలనున్నాయి. ఆ తర్వాత నవంబర్ 11, 12 తేదీల్లో ఎంపీపీ అధ్యక్షులు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ల ఎన్నికలు జరగనున్నాయి.

రెస్క్యూ సక్సెస్.. అంతా సేఫ్

ముద్ర, ఖమ్మం:

ఖమ్మం జిల్లా సత్తుపల్లి పరిధిలో ఆందోళన కలిగించిన రెస్క్యూ ఆపరేషన్ సుఖాంతమైంది. జలదిగ్బంధంలో చిక్కుకున్న మత్స్యకారులను కాపాడేందుకు వెళ్లిన ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది ప్రమాదవశాత్తు వరద ఉద్ధృతిలో కొట్టుకుపోయారు. దీంతో ఎన్డీఆర్ఎఫ్ బృందాలు, సత్తుపల్లి పోలీసులు సకాలంలో స్పందించడంతో ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది ప్రాణాలతో బయటపడ్డారు.

అసలేం జరిగింది?

గత కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో సత్తుపల్లి పరిధిలో వాగులు, చెరువులు పొంగిపొర్లుతున్నాయి. వరద నీటిలో చిక్కుకున్న కొంతమంది మత్స్యకారులను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది రంగంలోకి దిగారు. అయితే, వరద ప్రవాహం ఒక్కసారిగా పెరగడంతో సహాయక చర్యల్లో ఉన్న ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది ప్రవాహంలో కొట్టుకుపోయి గల్లంతయ్యారు.

ఎన్డీఆర్ఎఫ్ రెస్క్యూ ఆపరేషన్

గల్లంతైన సిబ్బంది కోసం ఎన్డీఆర్ఎఫ్ బృందాలు వెంటనే గాలింపు చర్యలు చేపట్టాయి. తెల్లవారుజామున ప్రవాహంలో చిక్కుకున్న 6 గురు ఎస్డీఆర్ఎఫ్ సిబ్బందిని సహాయక బృందాలు సురక్షితంగా కాపాడాయి. ఆ తర్వాత మరికొద్ది సేపటికి మరొక 4 గురిని రెస్క్యూ చేసి ప్రాణాలతో కాపాడారు. ఇక మరో సిబ్బంది వరద ఉద్ధృతి నుంచి ప్రాణాలు దక్కించుకోవడానికి ఒక చెట్టుపైకి ఎక్కి ఆశ్రయం పొందినట్లు గుర్తించిన బృందాలు, సాహసోపేతంగా రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించి అతడిని కూడా క్షేమంగా కిందకు దింపాయి.

ఆసుపత్రికి తరలింపు

రెస్క్యూ చేసిన ఎస్డీఆర్ఎఫ్ సిబ్బందికి ప్రాథమిక చికిత్స అనంతరం, సత్తుపల్లి పోలీసులు మెరుగైన వైద్యం కోసం సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారందరి ఆరోగ్యం స్థిరంగా ఉందని వైద్యులు తెలిపారు. వరదల్లో చిక్కుకున్న వారిని కాపాడేందుకు వెళ్లి తమ ప్రాణాలను పణంగా పెట్టిన సిబ్బంది అందరూ క్షేమంగా బయటపడటంతో అధికారులు, ఊపిరి పీల్చుకున్నారు.

అందరూ క్షేమంగానే

ఐదుగురు మత్స్యకారులను కాపాడటానికి 10 ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది, స్థానికుడు ఒకరు రాత్రి 7.30 గంటలకు రెండు బోట్లలో బయలుదేరారు. సిబ్బందిలో ఆరుగురు కొత్తగూడెం బెటాలియన్‌కు చెందిన పోలీసులు, మిగిలిన నలుగురు అగ్నిమాపక సిబ్బంది ఉన్నారు. సిబ్బంది పడవలు వరద ఉద్ధృతికి బోల్తా పడడంతో అలుగునీటిలో గల్లంతయ్యారు. గల్లంతైన వారిలో కొందరు ఒకేచోట ఉన్నారని, తమతో ఫోన్‌లో మాట్లాడారని జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి అజయ్‌కుమార్ పేర్కొన్నారు. రాత్రి 2.15 గంటలకు ఒకరిని, రాత్రి 3.00 గంటలకు నలుగురిని రక్షించారు. మిగిలిన వారిని సైతం గుర్తించి రక్షించారు. కలెక్టర్ రాత్రి 3 గం.ల వరకు ఘటనాస్థలంలో ఉండి పరిస్థితిని పర్యవేక్షించారు. అంతకు ముందు వరదలో చిక్కుకున్న ఐదుగురు మత్స్యకారులు ఓ మట్టి దిబ్బపైకి వెళ్లారు. నీళ్లు కాళ్ల వరకు వచ్చేయడంతో ఒకరికొకరు చేతులు పట్టుకొని సహాయం కోసం వేడుకున్నారు. రాత్రి 10.30 గంటలకు విజయవాడకు చెందిన ఎన్డీఆర్ఎఫ్ బృందం వీరి వద్దకు చేరుకుని, రాత్రి 11.20 గంటలకు క్షేమంగా బయటకు తీసుకొచ్చింది. ఘటనపై సీఎం, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆరా తీశారు.



ఆర్ఆర్ ట్యాక్స్ నిజమే అయితే చర్యలేవి?

ముద్ర, హైదరాబాద్:

తెలంగాణ రాజకీయాల్లో 'ఆర్ఆర్ ట్యాక్స్' వ్యవహారాన్ని మరోసారి తెరపైకి తెచ్చారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. ఈ అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ అగ్రనేతలు ఆరోపణలు చేస్తున్నారే తప్ప చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలను ప్రశ్నించారు. హైదరాబాద్‌కు వచ్చిన ప్రతిసారీ విమర్శలు చేయడం మినహా కేంద్రం చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు.

తన ఎక్స్ పోస్టులో కేటీఆర్ ఈ అంశాన్ని ప్రస్తావించారు. హైదరాబాద్‌లో ఏబిల్డర్‌ను, డెవలపర్‌ను అడిగినా 'ఆర్ఆర్ ట్యాక్స్' వసూళ్ల గురించి చెబుతారని పేర్కొన్నారు. చదరపు అడుగుకు రూ.200 చొప్పున వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు నిజం కాదా? అని ప్రశ్నించారు. రియల్ ఎస్టేట్ రంగంలో ఈ విషయం అందరికీ తెలిసినప్పుడు కేంద్రంలోని బీజేపీ పెద్దలకు తెలియదా అని నిలదీశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాహుల్ గాంధీ కలిసి 'ఆర్ఆర్ ట్యాక్స్' పేరుతో కోట్ల రూపాయలు దోచుకుంటున్నారని ప్రధాని మోదీ, అమిత్ షా ఆరోపిస్తున్నారని కేటీఆర్ అన్నారు. అలాంటప్పుడు ఆ వసూళ్లను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. హైదరాబాద్‌కు తరచూ వస్తున్న మోదీ, అమిత్ షాలు ఈ అంశంపై బహిరంగంగా విమర్శలు చేయడం తప్ప, తదుపరి చర్యలు తీసుకోవడం లేదని వ్యాఖ్యానించారు.

ఆర్ఆర్ ట్యాక్స్ వ్యవహారంలో బీజేపీ, కాంగ్రెస్ మధ్య అంతర్గత అవగాహన ఉందని కేటీఆర్ ఆరోపించారు. అందుకే కేంద్ర ప్రభుత్వం ఈ అంశంపై చర్యలకు ముందుకు రావడం లేదని విమర్శించారు. ఆరోపణలు చేయడం, రాజకీయంగా విమర్శలు గుప్పించడం తప్ప ఆ వసూళ్లపై విచారణ జరిపించేందుకు బీజేపీ నేతలు చొరవ చూపడం లేదని అన్నారు.

'ఆర్ఆర్ ట్యాక్స్' అంశంపై ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన సభలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. ఈ ఆరోపణలను తెలంగాణ కాంగ్రెస్ నాయకత్వం ఖండించింది. దీంతో రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ మధ్య ఈ అంశం రాజకీయ విమర్శలకు కేంద్రంగా మారింది. అయితే చదరపు అడుగుకు రూ.200 వసూలు చేస్తున్నారన్న కేటీఆర్ ఆరోపణపై స్వతంత్రంగా నిర్ధారితమైన ఆధారాలు ఈ కథనంలో ప్రస్తావించలేదు.



ఇందిరమ్మ ఇంట్లో సీఎం దీపావళి

ముద్ర, హైదరాబాద్:

దీపావళి పండుగ సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినూత్న కార్యక్రమానికి పిలుపునిచ్చారు. పేదల సొంతింటి కల నెరవేరిన వేళ, ఈ పండుగను ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులతో కలిసి జరుపుకోనున్నట్లు 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా వెల్లడించారు. "మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి" అని పేర్కొంటూ, పేదల ఇళ్లలో నిండే వెలుగులు, వారి సొంతింటి సంతోషంలో తాను స్వయంగా పాలుపంచుకోనున్నట్లు సీఎం స్పష్టం చేశారు. ఈ పండుగ వేళ ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు సైతం క్షేత్రస్థాయిలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లకు స్వయంగా వెళ్లి, లబ్ధిదారులతో కలిసి దీపావళి జరుపుకోవాలని రేవంత్ రెడ్డి సూచించారు. పేదల ముఖాల్లో ఆనందం నింపేలా ప్రభుత్వ యంత్రాంగం, ప్రజాప్రతినిధులు వారితో మమేకం కావాలని ఆయన పిలుపునిచ్చారు. సీఎం తీసుకున్న ఈ నిర్ణయం ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపగా, ప్రజాప్రతినిధులు కూడా తమ తమ నియోజకవర్గాల్లో లబ్ధిదారుల వద్ద పండుగ జరుపుకునేందుకు సన్నాహాలు చేస్తున్నారు.



బీసీ సంఘాలకు గుడ్ న్యూస్

ముద్ర, హైదరాబాద్:

వెనుకబడిన తరగతుల (బీసీ) సంక్షేమం దిశగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్‌లో 38 బీసీ కుల సంఘాల కోసం 'ఆత్మగౌరవ భవనాల' నిర్మాణానికి రూ. 88.50 కోట్లు మంజూరు చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వివిధ కుల సంఘాల ప్రతినిధులకు ప్రభుత్వ ఉత్తర్వుల (జీవో) పత్రాలను అందజేశారు. అన్ని కులాల సామాజిక, సాంస్కృతిక, విద్యాభివృద్ధి లక్ష్యంగా ఈ భవనాల నిర్మాణాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందని ఆయన తెలిపారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు, ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క సూచనల మేరకు బీసీ ఆత్మగౌరవ భవనాల నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేస్తున్నట్లు వివరించారు. గతంలో భూములు కేటాయించినప్పటికీ, కొన్ని పరిపాలనా, సాంకేతిక కారణాల వల్ల నిర్మాణాలు ముందుకు సాగలేదని గుర్తుచేశారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) సహకారంతో ఇప్పుడు ఆ అడ్డంకులన్నీ తొలగిపోయాయని చెప్పారు. స్థలాలను 'రెడీ-టు-కన్‌స్ట్రక్ట్' పద్ధతిలో లేఅవుట్లతో అభివృద్ధి చేశామని, ప్రభుత్వం నిధులు కూడా మంజూరు చేసినందున కుల సంఘాలు నిర్మాణ పనులు ప్రారంభించాలని సూచించారు.

సంవత్సరంలోగా ఈ భవనాల నిర్మాణాలు పూర్తి చేసి బీసీ ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే తమ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. నిర్మాణాలకు అవసరమైన అన్ని అనుమతులను ఇంజనీరింగ్ విభాగం, హెచ్ఎండీఏ సమన్వయంతో 'సింగిల్ విండో' విధానంలో జాప్యం లేకుండా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. నిర్మాణాల పురోగతిపై బీసీ సంక్షేమ శాఖ ప్రతినెలా సమీక్ష నిర్వహిస్తుందని తెలిపారు.

బీసీ కుల సంఘాలకు కేటాయించిన ప్లాట్లను ప్రభుత్వం వెనక్కి తీసుకుంటుందంటూ వస్తున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని పొన్నం ప్రభాకర్ తేల్చిచెప్పారు. ఈ భూములు బలహీన వర్గాల ఆస్తులని, వాటిని ఏ ప్రభుత్వం వెనక్కి తీసుకోదని భరోసా ఇచ్చారు. కేటాయించిన నిధులతో నిర్దిష్ట సమయంలోగా భవనాలను పూర్తి చేయాల్సిన బాధ్యత ఆయా సంఘాలపై ఉందని, జాప్యం జరిగితే సంఘాల ప్రతినిధులనే జవాబుదారీ చేస్తామని హెచ్చరించారు. అన్ని బీసీ కుల సంఘాలు సమావేశాలు, జయంతులు, ఇతర సామాజిక కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు వీలుగా హైదరాబాద్‌లో ఐదు ఎకరాల స్థలంలో ఒక సమగ్ర 'బీసీ భవన్' నిర్మించాలనే ప్రతిపాదనను కూడా మంత్రి పొన్నం ప్రస్తావించారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శుక్రవారం 6.11.2026
www.mudranews.in | @mudranews

వేరుశెనగ నూనె వాడొచ్చు.. కానీ మోతాదు ముఖ్యం!

భారతీయ వంటకాలకు అనువైన వేరుశెనగ నూనెలో ఆరోగ్యానికి మేలు చేసే మోనో అన్‌శాచురేటెడ్ కొవ్వులు ఉంటాయి. కూరలు, పోపులు, వేయింపులకు ఉపయోగించవచ్చు. అయితే కేలరీలు ఎక్కువగా ఉంటాయి కాబట్టి పరిమితంగా వాడాలి.



ఓటు హక్కుపై వేటు వేస్తే సహించం

ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

ముద్ర, హైదరాబాద్ : ప్రజల ఓటు హక్కుతో చెలగాటమాడే అధికారం ఎవరికీ లేదని మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ ఐఆర్) పేరుతో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిస్తే సహించేది లేదని హెచ్చరించారు. అర్హుల పేర్లు తొలగించడం ప్రజాస్వామ్య హక్కుల హననమేనన్నారు. ఓటరు జాబితాల్లో అవకతవకలపై ఎన్నికల సంఘం ఆధారాలతో సమాధానం చెప్పాలని, తొలగించిన ప్రతి పేరుకు కారణం వెల్లడించాలని డిమాండ్ చేశారు. పొరపాటున తొలగిన పేర్లను వెంటనే పునరుద్ధరించే వ్యవస్థ ఉండాలని కోరారు. ఓటు హక్కు పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటం దేశానికి దిక్సూచిగా నిలుస్తుందని కొనియాడారు. రాజ్యాంగ సంస్థలపై ప్రజలకు నమ్మకం కలగాలంటే పారదర్శకత, జవాబుదారీతనం తప్పనిసరని ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

హరిత మృతిపట్ల సీఎం చంద్రబాబు విచారం

ముద్ర, అమరావతి : అనంతపురం జిల్లా కూడేరు మండలం కాడదారకుంట పోలింగ్ కేంద్రంలో ఎన్నికల విధులు నిర్వహిస్తూ అస్వస్థతకు గురై పోలింగ్ అధికారి హరిత మృతి చెందడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విచారం వ్యక్తం చేశారు. హరిత (58) అనంతపురం జిల్లా డి.హీరాహాల్ మండలం పూలకుర్తి గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా పనిచేస్తున్నారు. ఎన్నికల విధుల్లో భాగంగా ఆమె కూడేరు మండలం కాడదారకుంట పోలింగ్ కేంద్రంలో విధులకు హాజరయ్యారు. ఈ క్రమంలో శ్వాస సంబంధిత సమస్య తలెత్తడంతో పోలింగ్ కేంద్రంలో అందుబాటులో ఉన్న వైద్య బృందం వెంటనే ఆమెను కూడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించింది. అక్కడ అత్యవసర వైద్య చికిత్స అందించినప్పటికీ గురువారం మధ్యాహ్నం 12.50 గంటలకు ఆమె మరణించారు. హరిత మృతి పట్ల ముఖ్యమంత్రి ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రభుత్వం ఆ కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. హరిత ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

యువతలో ఓటు హక్కుపై అవగాహన పెంచాలి

ముద్ర, హైదరాబాద్: యువతలో ప్రజాస్వామ్య విలువలు, ఎన్నికల ప్రక్రియ, ఓటు హక్కు ప్రాముఖ్యతపై అవగాహన పెంపొందించాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి సూచించారు. ఇందులో భాగంగా ఎలక్టోరల్ లిటరసీ క్లబ్‌ల ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించాలని ఆదేశించారు. నవంబర్ 2 నుంచి 7 వరకు పాఠశాలలు, కళాశాలల స్థాయిలో, నవంబర్ 10 నుంచి 13 వరకు నియోజకవర్గ స్థాయిలో, నవంబర్ 16 నుంచి 18 వరకు జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన జిల్లా కలెక్టర్లకు ఈ సూచనలు చేశారు. ఈ సమావేశంలో సూర్యాపేట కలెక్టరేట్ నుంచి కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, డీఆర్వో ప్రేమ్ రాజు, ఆర్డీవోలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అండాల సేకరణ రాకెట్‌పై దర్యాప్తు

ముద్ర, హైదరాబాద్: సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగుచూసిన అక్రమ అండాల సేకరణ వ్యవహారంపై దర్యాప్తు కొనసాగుతోందని సీపీ బి. సుమతి తెలిపారు. తొలుత వ్యభిచార రాకెట్‌గా భావించి విచారణ చేపట్టగా, అండాల సేకరణ వ్యవహారం వెలుగులోకి వచ్చిందన్నారు. మహిళలకు హార్మోనల్ ఇంజెక్షన్లు ఇచ్చి అండాలు సేకరించారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని, స్వాధీనం చేసుకున్న ఇంజెక్షన్లపై ఎఫ్ఎస్ఎల్ నివేదిక రావాల్సి ఉందని వెల్లడించారు. బాధిత మహిళలకు ఇంజెక్షన్లు ఉపయోగించారా లేదా అనేది ఫోరెన్సిక్ నివేదికతో తేలుతుందన్నారు. కేసులో అందరినీ నిందితులుగా పరిగణించలేమని, ఎవరి పాత్రకు సంబంధించి ఆధారాలు లభిస్తే వారినే నిందితులుగా గుర్తిస్తామని సుమతి స్పష్టం చేశారు.

అయ్యప్ప సొసైటీలో అక్రమ నిర్మాణాలు

- నెల రోజుల్లో చర్యలు తీసుకోవాలి : కవిత

ముద్ర, హైదరాబాద్ : అయ్యప్ప సొసైటీలో అక్రమ నిర్మాణాలపై నెల రోజుల్లో చర్యలు తీసుకోవాలని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఖానామెట్ ప్రాంతంలో 500 నుంచి 700 వరకు అక్రమ భవనాలు నిర్మించారని, ప్రస్తుతం మరో 80 భవనాలు నిర్మాణంలో ఉన్నాయని ఆరోపించారు. హైకోర్టు ఆదేశాలను పట్టించుకోకుండా అనుమతులు ఇస్తున్నారని, ముఖ్యమంత్రి కుటుంబ సభ్యుల అండతోనే అక్రమ దందాలు సాగుతున్నాయని విమర్శించారు. అక్రమ నిర్మాణాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే తమ పార్టీ తరపున వెళ్లి భవనాలకు రెడ్ మార్క్ వేస్తామని హెచ్చరించారు. ఖానామెట్‌లో సమగ్ర సర్వే నిర్వహించి, అనుమతులు లేని భవనాలపై చర్యలు తీసుకోవాలని, ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించని నిర్మాణాలను తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రజలు అక్కడ భూములు కొనుగోలు చేసి ఇబ్బందులు పడవద్దని సూచించారు.

కరువు ఉపశమనం, భూగర్భజల సంరక్షణపై సమీక్ష

ముద్ర, హైదరాబాద్ : కరువు ఉపశమన చర్యలు, భూగర్భజల సంరక్షణ పనులపై రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఆయా పనులకు కార్యాచరణ ప్రణాళిక ఖరారు చేయడంపై చర్చించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, భూగర్భజల, నీటిపారుదల శాఖలు చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ ప్రధాన కార్యదర్శి ఇ. శ్రీధర్, నవీన్ మిట్టల్, ఆదిత్యనాథ్ దాస్, ఈఎన్‌సీ రమేష్‌బాబు, కే. శ్రీనివాస్, గ్రామీణాభివృద్ధి కమిషనర్ దివ్య, భూగర్భజల శాఖ డైరెక్టర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రులను కలిసిన బండారు దత్తాత్రేయ

దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపిన మాజీ గవర్నర్

ముద్ర, న్యూఢిల్లీ, : హిమాచల్ ప్రదేశ్, హర్యానా రాష్ట్రాల మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ గురువారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రులను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. కేంద్ర న్యాయశాఖ సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత), పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్‌తో పాటు, కేంద్ర విద్యుత్, నూతన మరియు పునరుత్పాదక ఇంధన శాఖ సహాయ మంత్రి శ్రీపాద్ యెస్సో నాయక్‌ను ఆయన సౌజన్యపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రులకు బండారు దత్తాత్రేయ దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో జాప్యం చేయొద్దు

-టీయూడబ్ల్యూజే కార్యవర్గ సమావేశం సూచన



ముద్ర, హైదరాబాద్ : జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో జాప్యం చేయడం సరైంది కాదని, వాటి పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశం ప్రభుత్వాన్ని కోరింది. యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కే.విరాహత్ అలీ అధ్యక్షతన, బుధవారం సాయంత్రం, బిహెచ్ఇఎల్ లోని శుభం ప్రెస్టేజ్ గార్డెన్లో జరిగిన ఈ సమావేశంలో, రాష్ట్రంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు, పరిష్కార మార్గాలపై పలు తీర్మానాలను ఆమోదించింది. ముఖ్యంగా జర్నలిస్టుల ఇళ్ల స్థలాలకు సంబంధించి రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి, రాష్ట్ర సమాచార మరియు పౌర సంబంధాలు, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలు చేసిన సానుకూల ప్రకటనపై సమావేశం హర్షం వెలిబుచ్చింది. అయితే రాష్ట్ర రాజధాని హైదరాబాద్ తో పాటు వివిధ జిల్లాల్లో పెండింగ్ లో ఉన్న ఇళ్ల స్థలాల సమస్యను కూడా పరిష్కరించడానికి సత్వర చర్యలు చేపట్టాలని సమావేశం విజ్ఞప్తి చేసింది. అలాగే చాలా కాలంగా పెండింగ్ లో ఉన్న హెల్త్ కార్డుల సమస్యను కూడా పరిష్కరించాలని కోరింది.

ఆరోగ్య పథకం అమలు కాకపోవడంతో జర్నలిస్టుల్లో తీవ్ర ఆందోళన నెలకొన్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలని సమావేశం కోరింది. గత ప్రభుత్వం ఉద్యోగులతో పాటు జర్నలిస్టులకు ఆరోగ్య పథకాన్ని అమలు చేసినప్పటికీ కొంత కాలానికే నిలిచిపోయిందని, దీంతో గడిచిన పదేళ్ళలో అనారోగ్యానికి గురై, ప్రమాదాల్లో దాదాపు 500 మంది జర్నలిస్టులు అకాల మరణానికి గురైనట్లు సమావేశం విచారణ వ్యక్తం చేసింది. ప్రస్తుత ప్రభుత్వం ఉద్యోగులకు ఆరోగ్య పథకాన్ని పునరుద్ధరించినప్పటికీ జర్నలిస్టుల పట్ల జాప్యం చేయడం సరైంది కాదని సమావేశం అభిప్రాయపడింది. అనారోగ్యాలకు గురవుతున్న జర్నలిస్టులు భరించలేనంత అప్పులు చేసి ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందే పరిస్థితి నెలకొందని సమావేశం విచారం వ్యక్తం చేసింది. వెంటనే ఈ సమస్యపై ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి, రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా, రాష్ట్ర సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలు చొరవ చూపి జర్నలిస్టులకు వెంటనే హెల్త్ కార్డులు జారీ చేయాలని సమావేశం కోరింది. తాము అధికారంలోకి వస్తే మృతి చెందిన జర్నలిస్టుల కుటుంబాలకు తక్షణ సహాయంగా ప్రభుత్వం నుండి 5 లక్షల రూపాయలు అందిస్తామని ఎన్నికల్లో చేసిన వాగ్దానాన్ని అమలు చేయాలని సమావేశం సూచించింది. జర్నలిస్టుల కుటుంబాలకు ఆపద సమయంలో ఆదుకోవడానికి మీడియా అకాడమీ ఆధ్వర్యంలో ఇస్తున్న నెలసరి పెన్షన్ మొత్తాన్ని బాధిత కుటుంబ పోషణను దృష్టిలో పెట్టుకొని కనీసం పదివేల రూపాయలకు పెంచాలని సమావేశం విజ్ఞప్తి చేసింది. అలాగే ఏక మొత్తంలో చెల్లించే లక్ష రూపాయలను రెండు లక్షల రూపాయలకు పెంచాలని తెలంగాణ మీడియా అకాడమీని సమావేశం కోరింది.

ఈ సమావేశంలో తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కే శ్రీనివాస్ రెడ్డి ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయు) స్టీరింగ్ కమిటీ సభ్యులు దేవులపల్లి అమర్, ఎం.ఏ.మాజీద్ జాతీయ ఉపాధ్యక్షులు వై నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామనారాయణ, జాతీయ కార్యవర్గ సభ్యులు కే. సత్యనారాయణ, టీయూడబ్ల్యూజే మహిళా విభాగం నాయకులు కళ్యాణం రాజేశ్వరి, అత్తలూరి అరుణ, తెలంగాణ రాష్ట్ర చిన్న మధ్య తరగతి పత్రికల సంఘం అధ్యక్షులు యూసుఫ్ బాబు, ప్రధాన కార్యదర్శి అశోక్, తెలంగాణ రాష్ట్ర ఫోటో జర్నలిస్టుల అసోసియేషన్ అధ్యక్షులు గంగాధర్, ప్రధాన కార్యదర్శి కే.ఎన్.హరి, తెలంగాణ వీడియో జర్నలిస్టుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు హరీష్, గౌరవాధ్యక్షులు నాగరాజు లతోపాటు టియుడబ్ల్యూజే కార్యవర్గం, 29 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

రూ.9 వేల కోట్ల అభివృద్ధి పనులతో కొడంగల్‌కు సీఎం

నవంబర్ 7, 8, 9 తేదీల్లో మూడు రోజుల పర్యటన..
రైతు మేళా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పో ప్రారంభం

ముద్ర, కొడంగల్ : కొడంగల్ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నవంబర్ 7, 8, 9 తేదీల్లో మూడు రోజుల పాటు పర్యటించనున్నారు. ఈ సందర్భంగా రూ.9,053 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న 13 అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడంతో పాటు, పూర్తయిన రూ.46.08 కోట్ల విలువైన 10 ప్రభుత్వ భవనాలను ప్రారంభించనున్నారు. నవంబర్ 7న హకీంపేటలో మెగా రైతు మేళా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పోను సీఎం ప్రారంభిస్తారు. అనంతరం రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, పారిశ్రామికవేత్తలతో సమావేశమవుతారు. రూ.5,060 కోట్లతో రేడియల్ రోడ్డు–2, రూ.2,100 కోట్లతో ఎంఎన్‌కే ఎల్ఐఎస్ రెండో దశ, రూ.1,410 కోట్లతో బీటీ రహదారుల నిర్మాణం వంటి కీలక పనులకు శ్రీకారం చుట్టనున్నారు. వ్యవసాయ కళాశాల, పబ్లిక్ స్కూళ్లు, బస్‌స్టాండ్లు, స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రం నిర్మాణ పనులు కూడా ప్రారంభించనున్నారు. నవంబర్ 8న పలు విద్యా, వైద్య, పోలీస్ భవనాలను ప్రారంభించనున్నారు. 9వ తేదీన హకీంపేటలో జరిగే భారీ రైతు బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తారు. ఈ సభకు పది జిల్లాల నుంచి సుమారు 50 వేల మంది రైతులు హాజరయ్యేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆకట్టుకునేలా తెలంగాణ ఇన్వెస్ట్ సమ్మిట్

డిసెంబర్ 7 నుంచి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహణ
రక్షా ఎక్స్‌పో, ఇండియా జాయ్, స్టార్టప్ పెవిలియన్, క్లైమేట్ కాంక్లేవ్ ప్రత్యేక ఆకర్షణలు



ముద్ర, హైదరాబాద్: ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్–2026ను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. డిసెంబర్ 7 నుంచి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీలోని యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ప్రాంగణంలో ఈ సదస్సు జరగనుంది. ఏర్పాట్లపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం సచివాలయంలో మంత్రులు, ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. సమ్మిట్‌కు హాజరయ్యే ప్రతి ప్రతినిధికి ప్రత్యేక లైజనింగ్ అధికారిని నియమించాలని సీఎం ఆదేశించారు. విమానాశ్రయంలోనే రిజిస్ట్రేషన్, పాస్‌ల జారీ పూర్తి చేయాలని, ప్రతినిధులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయడంతోపాటు ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులను, పెట్టుబడులకు ముందుకొచ్చే కంపెనీల ప్రతినిధులను ఆహ్వానించాలని తెలిపారు. నవంబర్ 15 నాటికి పూర్తి కార్యాచరణ సిద్ధం చేయాలని ఆదేశించారు.

గత ఏడాదితో పోలిస్తే ఈసారి ఆరు ఎగ్జిబిషన్ హాళ్లను ఏర్పాటు చేస్తున్నారు. రక్షా ఎక్స్‌పో, ఇండియా జాయ్, స్టార్టప్ పెవిలియన్, ఫార్మా అండ్ లైఫ్ సైన్సెస్ ఎక్స్‌పో, వ్యవసాయ అనుబంధ రంగాల ప్రదర్శన, తెలంగాణ పెవిలియన్, ఎడ్యుకేషన్ ఎక్స్‌పో ప్రత్యేక ఆకర్షణలుగా నిలవనున్నాయి. రక్షా ఎక్స్‌పోలో రక్షణ, ఏరోస్పేస్, డ్రోన్లు, రోబోటిక్స్, సైబర్ సెక్యూరిటీకి సంబంధించిన ఆధునిక సాంకేతికతను ప్రదర్శించనున్నారు. ఇందుకోసం 575 సంస్థలను ఆహ్వానించారు. స్టార్టప్ పెవిలియన్‌లో 136 స్టార్టప్‌ల ఆవిష్కరణలను ప్రదర్శించనున్నారు. ఫార్మా, లైఫ్ సైన్సెస్ రంగాలకు చెందిన 60 కంపెనీలు పాల్గొననున్నాయి.

తెలంగాణ చరిత్ర, సంస్కృతి, చేనేత, బతుకమ్మ, కాకతీయుల శిల్పకళతోపాటు రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికలను ప్రతిబింబించేలా ప్రత్యేక పెవిలియన్ ఏర్పాటు చేస్తున్నారు. విద్య, పరిశోధన, నైపుణ్యాభివృద్ధిపై ఎడ్యుకేషన్ ఎక్స్‌పో నిర్వహించనున్నారు. పర్యాటక రంగానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చేలా రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలను ప్రదర్శించాలని సీఎం సూచించారు. మూడు రోజుల పాటు నాలుగు ప్రధాన హాళ్లలో 52 రంగాలవారీ సమావేశాలు నిర్వహించనున్నారు. ఇప్పటికే సుమారు 3,500 ఆహ్వానాలు పంపించారు.

ఎల్‌నినో సవాళ్లపై క్లైమేట్ కాంక్లేవ్

వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావంతో తలెత్తే కరువు పరిస్థితులపై డిసెంబర్ 8న తెలంగాణ క్లైమేట్ కాంక్లేవ్ నిర్వహించనున్నారు. ఇందులో సుమారు 200 మంది శాస్త్రవేత్తలు, రైతులు, నిపుణులు పాల్గొంటారు. కరువును తట్టుకునే వ్యవసాయం, పశుసంరక్షణ, తాగునీటి భద్రత, అధిక ఉష్ణోగ్రతల నుంచి రక్షణ, అడవులు, జీవవైవిధ్య పరిరక్షణ వంటి అంశాలపై చర్చిస్తారు. వాతావరణ సవాళ్లకు తక్షణ, దీర్ఘకాలిక పరిష్కారాలతో ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సీఎం సూచించారు.

ఈ సమావేశంలో సీఎం, డిప్యూటీ సీఎం తోపాటు మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ముఖ్యమంత్రి సలహాదారు కె. రామకృష్ణారావు, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, గ్లోబల్ సమ్మిట్ అధికారుల కమిటీల సభ్యులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫామ్స్..

1,483 మందికి స్పోర్ట్స్ డ్రెస్ పంపిణీ
నానక్‌రామ్‌గూడ, గౌలిదొడ్డి సహా నాలుగు ప్రభుత్వ పాఠశాలల్లో పంపిణీ..
మరో 7,288 మందికి అందించేందుకు ఏర్పాట్లు





ముద్ర, హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ప్రోత్సహించేందుకు చేపట్టిన 'ప్రభుత్వ బడి బిడ్డలకు ప్రేమతో' కార్యక్రమం తొలి విడత విజయవంతంగా పూర్తయింది. కమరాజు అన్నపూర్ణమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా నాలుగు ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తం 1,483 మంది విద్యార్థులకు క్రీడా యూనిఫామ్స్ పంపిణీ చేశారు. నానక్‌రామ్‌గూడ, గౌలిదొడ్డి, మదీనాగూడ, గోపన్‌పల్లి తండాలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కొత్త యూనిఫామ్స్ అందుకున్న విద్యార్థుల ముఖాల్లో కనిపించిన ఆనందం కార్యక్రమ నిర్వాహకులను ఆకట్టుకుంది.

ఈ సందర్భంగా ట్రస్ట్ ప్రతినిధి తన పాఠశాల రోజుల జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. తాను కూడా ఒకప్పుడు నయాబజార్ కోఠి పాఠశాలలో చదువుకున్నానని, ఆ వయసులో చిన్నపాటి ప్రోత్సాహం కూడా విద్యార్థుల్లో ఎంతో ఆత్మవిశ్వాసాన్ని నింపుతుందని పేర్కొన్నారు. విద్యార్థుల ముఖాల్లో చిరునవ్వులు చూడటం ఎంతో సంతోషాన్నిచ్చిందన్నారు.

కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఇది కేవలం ప్రారంభం మాత్రమేనని, తదుపరి విడతల్లో మరో 13 పాఠశాలలకు చెందిన 7,288 మంది విద్యార్థులకు క్రీడా యూనిఫామ్స్ పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు తమ పాఠశాలల గురించి గర్వపడాలని, చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. పట్టుదల, కృషి ఉంటే జీవితంలో ఎంతటి ఉన్నత స్థాయికైనా చేరుకోవచ్చని విద్యార్థులకు సందేశమిచ్చారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in | @mudranews
శుక్రవారం, 06 నవంబర్, 2026
4
వేదిక
Peoples Voice

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..



వాట్సప్ నం.: 9849623744
మేయిల్: mudradaily@gmail.com

చలికాలంలో ఆరోగ్యాన్ని దెబ్బతీసే
ఏడు అలవాట్లు
వీటిని అస్సలు నిర్లక్ష్యం చేయకండి!

ఉదయం వేళల్లో చలి క్రమంగా పెరుగుతోంది. చల్లని గాలులు, ఉష్ణోగ్రతల్లో మార్పులతో చాలామందికి జలుబు, దగ్గు, గొంతునొప్పి వంటి సమస్యలు ఎదురవుతుంటాయి. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, ఆస్తమా వంటి శ్వాసకోశ సమస్యలు ఉన్నవారు ఈ సమయంలో మరింత జాగ్రత్తగా ఉండాలి. అయితే చల్లని వాతావరణం వల్ల నేరుగా వైరల్ ఇన్ఫెక్షన్లు రావు. ఉష్ణోగ్రతల్లో మార్పులు, ఎక్కువసేపు గదుల్లోనే ఉండటం, గాలి ప్రసరణ సరిగా లేకపోవడం వంటి కారణాలతో వైరస్‌లు వ్యాపించే అవకాశం పెరుగుతుంది. రోజువారీ అలవాట్లలో చేసే కొన్ని పొరపాట్లు అనారోగ్యానికి దారితీయవచ్చు.

చలికాలంలో అనారోగ్యానికి దారితీసే 7 పొరపాట్లు

న్యూస్9 డిజిటల్‌తో ప్రత్యేకంగా మాట్లాడిన మెడ్‌ఫస్ట్ ఈఎన్‌టీ సెంటర్ కన్సల్టెంట్ డాక్టర్ (మేజర్) రాజేష్ భరద్వాజ్ ప్రకారం.. వాతావరణ మార్పుల సమయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా శ్వాసకోశ ఇన్ఫెక్షన్ల ముప్పును తగ్గించుకోవచ్చు.

వాతావరణానికి తగిన దుస్తులు ధరించకపోవడం: ఉదయం, రాత్రి వేళల్లో బయటకు వెళ్లేటప్పుడు తగినంత వెచ్చని దుస్తులు ధరించాలి. చలికి అనుగుణంగా దుస్తులను పొరలుగా వేసుకోవడం మంచిది.

నీరు తక్కువగా తాగడం: చలికాలంలో దాహం తక్కువగా అనిపించినా శరీరానికి తగినంత నీరు అవసరం. నీరు తక్కువగా తీసుకోవడం వల్ల గొంతు, ముక్కులోని శ్లేష్మ పొరలు పొడిబారవచ్చు. కాబట్టి రోజంతా తగినంత ద్రవాలు తీసుకోవాలి.


చేతుల పరిశుభ్రతను నిర్లక్ష్యం చేయడం: బయటకు వెళ్లి వచ్చిన తర్వాత, ముఖ్యంగా రద్దీ ప్రాంతాల్లో తిరిగినప్పుడు చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి. చేతులతో కళ్లు, ముక్కు, నోటిని తాకద్దు.


గదుల్లోకి గాలి రాకుండా చేయడం: చలి కారణంగా కిటికీలు ఎప్పుడూ మూసి ఉంచడం మంచిది కాదు. సాధ్యమైనప్పుడు గదుల్లోకి స్వచ్ఛమైన గాలి వచ్చేలా చూసుకోవాలి.

అనారోగ్య లక్షణాలను తేలికగా తీసుకోవడం: తుమ్ములు, గొంతునొప్పి, దగ్గు, జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకూడదు. అవి ఎక్కువవుతున్నా, ఎక్కువకాలం కొనసాగుతున్నా వైద్యులను సంప్రదించాలి.

నిద్ర, ఆహారంపై శ్రద్ధ చూపకపోవడం: తగినంత నిద్ర లేకపోవడం, పోషకాహారం తీసుకోకపోవడం శరీర సాధారణ రోగనిరోధక పనితీరును ప్రభావితం చేయవచ్చు. పండ్లు, కూరగాయలతో కూడిన సమతుల్య ఆహారం తీసుకోవాలి.

సొంతంగా మందులు వాడటం: జలుబు, దగ్గు వచ్చిన ప్రతిసారీ వైద్యుల సలహా లేకుండా యాంటీబయాటిక్స్ వాడద్దు. సాధారణ జలుబు ఎక్కువగా వైరస్‌ల వల్ల వస్తుంది. యాంటీబయాటిక్స్ వైరస్‌లపై పనిచేయవు.





ఎవరికి ఎక్కువ జాగ్రత్త అవసరం?

ఆస్తమా, సీఓపీడీ (COPD), గుండె సంబంధిత సమస్యలు, రోగనిరోధక శక్తి తగ్గినవారు వాతావరణ మార్పుల సమయంలో అప్రమత్తంగా ఉండాలి. వైద్యుల సూచన మేరకు అవసరమైన టీకాలు వేయించుకోవడం కూడా ఇన్ఫెక్షన్ల ముప్పును తగ్గించడంలో సహాయపడుతుంది.

ముఖ్యంగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, ఛాతినొప్పి, తగ్గని అధిక జ్వరం లేదా లక్షణాలు తీవ్రమవడం వంటి సమస్యలు ఉంటే వెంటనే వైద్య సహాయం పొందాలి. చలికాలంలో ఆరోగ్యంగా ఉండాలంటే తగిన దుస్తులు ధరించడం, నీరు తాగడం, పరిశుభ్రత పాటించడం, నిద్రకు ప్రాధాన్యం ఇవ్వడం వంటి చిన్న అలవాట్లను నిర్లక్ష్యం చేయకూడదు.



డాక్టర్లలో పెరుగుతున్న డిప్రెషన్

అక్టోబర్ 10న ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం. వైద్య వృత్తిలో ఉన్నవారి మానసిక ఆరోగ్యం, క్షేమంపై బహిరంగంగా చర్చించే వాతావరణాన్ని ప్రోత్సహించడానికి భారత్, బ్రిటన్ దేశాలకు చెందిన ఆరు ప్రముఖ మానసిక ఆరోగ్య, వైద్య సంస్థలు చేతులు కలిపాయి. 'హ్యూమనైజింగ్ మెడిసిన్ ఇండియా ఇనిషియేటివ్' పేరుతో ప్రారంభించిన ఈ కార్యక్రమం వైద్యులు, ఇతర ఆరోగ్య సంరక్షణ నిపుణుల అనుభవాలను కేంద్రంగా చేసుకుని వారి మానసిక సమస్యలు, పనిప్రాంతాల్లో శ్రేయస్సుపై దృష్టి సారిస్తుంది.

ఆరు వైద్య సంస్థల భాగస్వామ్యంతో కార్యక్రమం

ఈ సంకీర్ణంలో ఇండియా మెంటల్ హెల్త్ అలయన్స్, ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ, ఇండియన్ టీచర్స్ ఆఫ్ సైకియాట్రీ, వరల్డ్ సైకియాట్రిక్ అసోసియేషన్ జోన్ 15, యూకేకి చెందిన డెర్బీషైర్ హెల్త్‌కేర్ ఎన్‌హెచ్ఎస్ ఫౌండేషన్ ట్రస్ట్, ఆశ కేరళ సంస్థలు భాగస్వాములుగా ఉన్నాయి. వైద్యులలో పెరుగుతున్న ఒత్తిడి, బర్నౌట్, మానసిక ఆరోగ్య సమస్యల నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ చర్య చేపట్టారు. సాధారణంగా రోగులకు సహాయం కోరాలని సూచించే వైద్యులు, తమ సొంత మానసిక ఒత్తిడిని ఒప్పుకోవడానికి వృత్తిపరమైన ఇమేజ్, సామాజిక అపవాదు కారణాల వల్ల వెనుకాడుతున్నారని నిర్వాహకులు వెల్లడించారు.

భవిష్యత్ కార్యక్రమాలు, ప్రణాళికలు

ఈ కార్యక్రమంలో భాగంగా డాక్టర్ల అనుభవాలు, సహాయం పొందడంలో ఎదురవుతున్న అవరోధాలను అంచనా వేయడానికి ఓ జాతీయ సర్వే నిర్వహించనున్నారు. దీనితో పాటు వైద్యుల శ్రేయస్సుపై మూడు భాగాల జాతీయ వెబ్‌నార్ సిరీస్‌ను ఏర్పాటు చేయనున్నారు. జనవరి 2027లో మధురైలో జరిగే ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ వార్షిక సదస్సులో జాతీయ స్థాయి ప్రత్యక్ష వర్క్‌షాప్‌తో ఈ కార్యక్రమం ముగుస్తుంది. ఈ చొరవలో భాగంగా వైద్యులు తమ సొంత శ్రేయస్సుకు ప్రాధాన్యత ఇవ్వడానికి 'కేర్ ఫర్ సెల్ఫ్ ప్లెడ్జ్', మానసిక ఆరోగ్య చర్చలకు సురక్షితమైన స్థలాన్ని అందించడానికి 'కల్చర్ ఆఫ్ కేర్ చార్టర్' ప్రతిపాదనలను రూపొందించనున్నారు.

లీసెర్ట్ ఆధారాలు, విశ్లేషణ

ఆరోగ్య రంగంలో ఉన్న తీవ్రతను వివరిస్తూ అధ్యయనాల వివరాలను నిర్వాహకులు వెల్లడించారు. ఇండియాలో జరిగిన అధ్యయనాల ప్రకారం దాదాపు సగం మంది అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్ విద్యార్థులలో డిప్రెషన్ లక్షణాలు కనిపించాయి. అలాగే ఒక టెర్షియరీ-కేర్ ఆస్పత్రిలోని రెసిడెంట్ డాక్టర్లు, ఫ్యాకల్టీపై జరిపిన అధ్యయనంలో 30.1శాతం మంది ఒత్తిడితో బాధపడుతున్నారని, 16.7శాతం మంది ఆత్మహత్య ఆలోచనలను నివేదించారని, 90 శాతం కంటే ఎక్కువ మంది బర్నౌట్‌ను ఎదుర్కొంటున్నారని తేలింది. సహాయం కోరడం అనేది ఓ మంచి వైద్యుడిగా ఉండటానికి అవరోధం కాదని, వృత్తిపరమైన సంస్కృతిలో మార్పు రావడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిపుణులు పేర్కొన్నారు.

దానిమ్మతో గుండెకు మేలు?

రుచికరమైన ఎర్ర గింజలతో అందరినీ ఆకట్టుకునే దానిమ్మ పండు కేవలం రుచిలోనే కాదు, ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తుందని మనందరికీ తెలుసు. పెరుగులో వేసుకుని తిన్నా, సలాడ్లలో కలుపుకున్నా లేదా అలాగే తిన్నా దానిమ్మ ఎప్పుడూ ప్రత్యేకమే. అయితే, ఈ పండు కేవలం రుచికరమైనది మాత్రమే కాదని, గుండె ఆరోగ్యానికి సంబంధించి పరిశోధకులను ఆశ్చర్యపరుస్తున్న విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. దీని ద్వారా మన ఆరోగ్యానికి అందే ప్రయోజనాలు విశేషమైనవిగా నిపుణులు చెబుతున్నారు.

దానిమ్మ పండ్లు తిన్న తర్వాత మన శరీరంలో తయారయ్యే 'యురోలిథిన్ ఏ' (Urolithin A) అనే సమ్మేళనంపై శాస్త్రవేత్తలు తాజాగా పరిశోధనలు జరిపారు. జంతువులపై నిర్వహించిన ప్రయోగాల్లో ఈ సమ్మేళనం గుండె పనితీరును మెరుగుపరచడంలో అద్భుతంగా పనిచేసినట్లు తేలింది. గుండె కండరాలు సడలడంలో సహాయపడటం, గుండెలో మచ్చలు (fibrosis) ఏర్పడటాన్ని తగ్గించడం, గుండె పరిమాణం హానికరంగా పెరగకుండా నిరోధించడంలో ఇది కీలక పాత్ర పోషిస్తున్నట్లు గుర్తించారు. అయితే ఈ పరిశోధనలు ఇంకా ప్రాథమిక దశలోనే ఉన్నాయని, నేరుగా మనుషులపై క్లినికల్ ట్రయల్స్ జరగాల్సి ఉందని నిపుణులు చెప్తున్నారు.

ప్రయోగాల ఫలితాలకు, సాధారణ వినియోగానికి తేడా

జంతువులపై జరిగిన ప్రయోగాల్లో గుండె పనితీరు మెరుగైందని తేలినప్పటికీ, రోజూ దానిమ్మ పండ్లు తింటే మనుషులలో గుండె పనితీరు 80 శాతం మెరుగవుతుందని దీని అర్థం కాదు. కాబట్టి ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు, అలాగే ఇళ్లలోనే మందుల ఫ్యాక్టరీలు ఏర్పాటు చేసుకోవాల్సిన పనిలేదు. అయితే మీ రోజువారీ ఆహారంలో దానిమ్మను భాగం చేసుకోవడం ద్వారా అనేక ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చు. దీన్ని మరింత రుచికరంగా తీసుకోవడానికి కొన్ని సులభమైన మార్గాలు ఇక్కడ ఉన్నాయి.

దానిమ్మతో 5 వంటకాలు

దానిమ్మ యోగర్ట్ బౌల్:

చిక్కటి పెరుగులో దానిమ్మ గింజలు, సన్నగా తరిగిన వాల్‌నట్స్, చిటికెడు దాల్చిన చెక్క పొడి కలుపుకోవాలి. కావాలనుకుంటే ఓట్స్ లేదా అరటిపండు ముక్కలు, కొద్దిగా తేనె జోడించుకుంటే రుచికరమైన అల్పాహారం సిద్ధమవుతుంది.

దానిమ్మ చాట్:

దానిమ్మ గింజలతో పాటు దోసకాయ, టొమాటో, ఉడికించిన శనగలు, కొత్తిమీర వేసి కలపాలి. అందులో నిమ్మరసం, జీలకర్ర పొడి, కొద్దిగా చాట్ మసాలా వేస్తే నిమిషాల్లో రిఫ్రెషింగ్ చాట్ రెడీ అవుతుంది.

దానిమ్మ వాల్‌నట్ సలాడ్:

ఆకుకూరల మిశ్రమంలో దానిమ్మ గింజలు, వాల్‌నట్స్, దోసకాయ ముక్కలు వేసి, కొద్దిగా ఆలివ్ ఆయిల్, నిమ్మరసం, మిరియాల పొడితో కలుపుకుంటే ఆరోగ్యకరమైన సలాడ్ తయారవుతుంది.

దానిమ్మ ఓట్స్:

సాధారణంగా వండుకునే ఓట్స్‌పై దానిమ్మ గింజలు, వాల్‌నట్స్, దాల్చిన చెక్క పొడి వేసుకుని తింటే బేసిక్ ఓట్స్ కూడా చాలా రుచిగా మారతాయి.

దానిమ్మ సాల్సా:

దానిమ్మ గింజలతో పాటు సన్నగా తరిగిన దోసకాయ, టొమాటో, ఉల్లిపాయ, పచ్చి మిర్చి, కొత్తిమీర తరుగును కలపాలి. చిటికెడు ఉప్పు, నిమ్మరసం పిండుకుని దీన్ని గ్రిల్ చేసిన ఆహారాలతో లేదా టోస్ట్ చేసిన బ్రెడ్‌తో తీసుకుంటే అద్భుతంగా ఉంటుంది.

పెరుగుతింటే జలుబు?
వైద్యులు ఏం చెప్తున్నారంటే?

చలికాలం రానేవచ్చింది. తెలుగు రాష్ట్రాల్లో రాత్రివేళ ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. సాధారణంగా శీతాకాలం వచ్చిందంటే చాలు.. కొందరు పెరుగు తినడానికి వెనుకాడుతుంటారు. పెరుగు తింటే జలుబు, దగ్గు వస్తాయని భావిస్తారు. ఇలా అనుకుని పెరు గును దూరం పెట్టవద్దని వైద్యులు సూచిస్తున్నారు. దీన్ని తినడం వల్ల ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని అంటున్నారు.

జీర్ణక్రియకు మేలు


పెరుగులో శరీరానికి మేలు చేసే సూక్ష్మజీవులు (ప్రోబయోటిక్స్) ఉంటాయి. ఇవి జీర్ణక్రియ సజావుగా సాగడంలో తోడ్పడతాయి. పెరుగులోని కాల్షియం ఎముకల బలానికి ఉపయోగపడుతుంది. దీనివల్ల ప్రోటీన్, విటమిన్ బీ12, భాస్వరం వంటి పోషకాలు కూడా శరీరానికి అందుతాయి.

జలుబు మాటేంటి..?

చలికాలంలో పెరుగు తింటే తప్పనిసరిగా జలుబు, దగ్గు వస్తాయనడానికి బలమైన శాస్త్రీయ ఆధారాలు లేవు. అయితే పెరుగు తిన్నప్పుడు కొందరికి గొంతులో కఫం పేరుకున్నట్టు అనిపించవచ్చు. ఇప్పటికే దగ్గు, గొంతు ఇబ్బందులు లేదా అలర్జీలు ఉన్నవారు తమకు ఏ ఆహారం ఇబ్బంది కలిగిస్తుందో గమనించాలి.


ఈ జాగ్రత్తలు అవసరం

చలికాలంలో రిఫ్రిజిరేటర్‌లో నుంచి తీసిన చల్లటి పెరుగు తినడం కొందరికి అసౌకర్యాన్ని కలిగించవచ్చు. అలాంటివారు గది ఉష్ణోగ్రతకు పెరుగు వచ్చిన తర్వాత తీసుకోవచ్చు. అలాగే రాత్రిపూట పెరుగు తినకూడదనే నియమం అందరికీ వర్తించదు. అయితే వ్యక్తి గత ఆరోగ్య పరిస్థితులు, ఆహారపు అలవాట్లను బట్టి నిర్ణయం తీసుకోవాలి. పెరుగు తిన్నప్పుడు కడుపు ఉబ్బరం, విరేచనాలు వంటి సమస్యలు వస్తే దాని వినియోగాన్ని తగ్గించడం మంచిది.



వీళ్లు మటన్ అస్సలు తినకూడదు

తెలుగు రాష్ట్రాల్లో మాంసాహార ప్రియుల జాబితాలో మటన్‌కు ప్రత్యేక స్థానం ఉంది. ఆదివారం వచ్చిందంటే చాలు చాలా ఇళ్లలో మటన్ కర్రీ లేదా బిర్యానీ ఉండాల్సిందే. శరీరానికి తక్షణ శక్తిని, ప్రొటీన్లను అందించడంలో మటన్ ముందుంటుంది. అయితే, రుచికరంగా ఉంటుందని అందరూ దీన్ని ఒకేలా తీసుకోవడం ఆరోగ్యానికి మంచిది కాదు. కొన్ని ప్రత్యేకమైన ఆరోగ్య సమస్యలు ఉన్నవారు మటన్‌కు ఎంత దూరంగా ఉంటే అంత మంచిదని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. అవేంటో ఇప్పుడు వివరంగా చూద్దాం.



గుండె జబ్బులు, హై కొలెస్ట్రాల్ ఉన్నవారు: మటన్‌లో సాచురేటెడ్ ఫ్యాట్స్, కొలెస్ట్రాల్ శాతం చాలా ఎక్కువగా ఉంటుంది. ఇప్పటికే గుండె సంబంధిత సమస్యలు, హైపర్‌టెన్షన్ లేదా చెడు కొలెస్ట్రాల్ (LDL) సమస్యతో బాధపడేవారు మటన్ తింటే పరిస్థితి క్షీణించవచ్చు. ఇది రక్తనాళాల్లో కొవ్వు పేరుకుపోయేలా చేసి, గుండెపోటు లేదా స్ట్రోక్ వచ్చే ప్రమాదాన్ని పెంచుతుంది.

యూరిక్ యాసిడ్, కీళ్ల నొప్పులు: కీళ్ల నొప్పులు, గౌట్ సమస్య ఉన్నవారు మటన్‌ను పూర్తిగా నివారించాలి. మటన్‌లో ప్యూరిన్స్ అనే పదార్థాలు అధికంగా ఉంటాయి. ఇవి శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయిలను అకస్మాత్తుగా పెంచుతాయి. ఫలితంగా కీళ్లలో విపరీతమైన నొప్పులు, వాపులు వచ్చే అవకాశం ఉంది.

కిడ్నీ వ్యాధిగ్రస్తులు: కిడ్నీ సంబంధిత సమస్యలు ఉన్నవారు మాంసాహారాన్ని తక్కువగా తీసుకోవాలని డాక్టర్లు చెబుతారు. మటన్‌లో ఉండే హై ప్రొటీన్ కంటెంట్ కిడ్నీలపై అదనపు భారాన్ని మోపుతుంది. దీనివల్ల మలినాలను వడకట్టడంలో కిడ్నీలు ఇబ్బంది పడతాయి.

జీర్ణ సమస్యలు, ఊబకాయం: మటన్ జీర్ణం కావడానికి చాలా ఎక్కువ సమయం పడుతుంది. బలహీనమైన జీర్ణ శక్తి ఉన్నవారు లేదా తరచూ అజీర్ణం, గ్యాస్, కడుపు ఉబ్బరంతో బాధపడేవారు మటన్‌ను జీర్ణించుకోవడం కష్టం. అలాగే బరువు తగ్గాలనుకునేవారు, ఊబకాయం సమస్య ఉన్నవారు దీనికి దూరంగా ఉండటం మంచిది.





మటన్‌లో పోషకాలు ఉన్నప్పటికీ, కొందరికి అది విషంతో సమానం కావచ్చు. కాబట్టి, మీకు పైన పేర్కొన్న ఏవైనా ఆరోగ్య సమస్యలు ఉంటే, మీ డైట్‌లో మార్పులు చేసుకునే ముందు తప్పనిసరిగా వైద్యుల లేదా పోషకాహార నిపుణుల సలహా తీసుకోవడం ఉత్తమం. ఆరోగ్యం ముఖ్యం అనే విషయాన్ని ఎప్పుడూ మరువకండి!

టీ VS కాఫీ
ఏది మంచిది, ఏది డేంజర్..!?

ప్రతీ ఇంటా టీ – కాఫీ ఉండాల్సిందే. చాలా మందికి ఇవి లేకుండా రోజు మొదలు కాదు. ప్రతీ రోజు నాలుగు సార్లు వరకు వీటిని సేవించే వారు ఉన్నారు. జీవన శైలిలో ఈ రెండు ఒక భాగంగా మారిపోయాయి. ఉదయాన్నే టీ లేదా కాఫీ తాగితే వెంటనే మైండ్ రీఫ్రెష్ అవుతుందని చాలా మంది భావిస్తారు. అయితే, కాఫీ, లేదా టీ ఏది తాగితే ఆరోగ్యానికి మంచిది అనే సందేహం చాలా మందిలో నెలకొంది. కాగా.. తాజాగా ఒక అధ్యయనం టీ – కాఫీ ఆరోగ్య పరంగా ఎవరికి ఏది మంచిదో వివరిస్తూనే.. కీలక అంశాలను వెల్లడించింది.



టీ – కాఫీ రెగ్యులర్‌గా తీసుకునే వారిలో అనేక సందేహాలుంటాయి. టీ లేదా కాఫీ ఆరోగ్యానికి మేలు చేస్తుందా.. ఏది తీసుకుంటే ఉపయోగం ఉంటుందో నిపుణులు స్పష్టత ఇస్తున్నారు. ఉదయం సమయంలో టీ లేదా కాఫీ తాగటానికి అలవాటు పడిన వారు ఏ ఒక్క రోజు తాగకుండా ఉండలేరు. ఇలా టీ కాఫీలకు అలవాటు పడటం వెనుక ఏ కారణం ఉన్నా, ఈ రెండింటిలో ఏది బెస్ట్ అనే విషయానికి వస్తే.. టీ కాఫీ రెండింటి ప్రయోజనాల తో పాటుగా దుష్ప్రభావాలు ఉన్నాయి. కాగా, టీ లో ఎల్ థియోనైన్ అనే యాంటీ ఆక్సిడెంట్ ఉంటుంది. ఇది మన మెదడును స్టిమ్యులేట్ చేస్తుంది. ఈ యాంటీ ఆక్సిడెంట్ మనలో ఫోకస్, అటెన్షన్, ఆలోచనా శక్తిని పెంచుతుంది. రెగ్యు లర్ గా టీ తాగే వారిలో ఎముకల సాంద్రత ఎక్కువగా ఉండడంతో పాటు రోగ నిరోధక శక్తి కూడా పెరుగుతుంది. కాఫీలో ఎక్కువగా ఉండే కెఫీన్ వల్ల బరువు తగ్గే వీలుంటుందని నిపుణులు వెల్లడి స్తున్నారు.

నిపుణుల సూచనలు

కాగా, అనేక మంది బ్లాక్ కాఫీని వర్కవుట్ ముందు ప్రీ వర్కవుట్‌గా తీసుకుంటూ ఉంటారు. కొవ్వును కరిగించే గుణాలు కాఫీలో ఎక్కువగా ఉంటాయి. అదే విధంగా గుండె జబ్బులు, డయాబెటిస్, పార్కిన్సన్స్ వంటి సమస్యలను కూడా తగ్గించేందుకు కాఫీ దోహదపడుతుంది. ఇక, కాఫీ ఎక్కువగా తీసుకోవడం వల్ల గ్యాస్ట్రిక్ సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. టీ ఎక్కువగా తాగడం వల్ల ఆహారంలోని ఐరన్ ని తీసుకోవడానికి ఇబ్బంది ఎదురవుతుంది. కాగా, ఆహారం తిన్న తర్వాత టీ తాగడం వల్ల ఆహారంలోని ఐరన్‌ని తీసుకునే శక్తి 62 శాతం మేర తగ్గుతుంది. కాఫీ తీసుకుంటే ఇది కేవలం 35 శాతం మేరకే ఉంటుంది. టీ తో పోల్చితే కాఫీ చాలా ఎసిడిక్ గుణం కలిగి ఉంటుంది. ఫిల్టర్ చేయని కాఫీ వల్ల కొలెస్ట్రాల్ కూడా పెరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని చెబుతున్నారు. రోజూ నాలుగు కప్పుల కంటే ఎక్కువ కాఫీ తాగితే ఎముకల సాంద్రత తగ్గే అవకాశాలుంటాయని విశ్లేషిస్తున్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శుక్రవారం 06.11.2026
www.mudranews.in | @mudranews

నెయ్యి, వెన్న వినియోగాన్ని తగ్గించండి



నెయ్యి, వెన్న, వనస్పతి వంటి వాటిలో సంతృప్త కొవ్వులు ఎక్కువగా ఉంటాయి. వీటిని అధికంగా తీసుకోవడం వల్ల చెడు కొలెస్ట్రాల్ పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా గుండె సమస్యలు ఉన్నవారు వీటి వినియోగాన్ని పరిమితం చేయాలి.

సముద్రంలో 60 రోజులు.!

పెంపుడు కుక్కతో సహా ప్రాణాలతో బయటపడ్డ 86 ఏండ్ల వృద్ధుడు!

ముద్ర, కాలిఫోర్నియా :

అమెరికాలో 86 ఏండ్ల వృద్ధుడు తన పెంపుడు కుక్కతో పాటు సముద్రంలో రెండు నెలల పాటు చిక్కుకుపోయాడు. ఆగస్టు 20 నుంచి అతని ఆచూకీ లేకపోవడంతో అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. అక్టోబర్ 27న పడవ నుంచి అత్యవసర సంకేతాలు అందడంతో అమెరికా కోస్ట్‌గార్డ్ రంగంలోకి దిగింది.కాలిఫోర్నియా తీరానికి సమీపంలో వృద్ధుడిని, అతని కుక్కను రక్షించింది. ఒరెగావ్‌లోని ఆస్టోరియా నుంచి అమెరికన్ సమోవాలోని పాగో పాగోకు పడవలో అతను బయలుదేరగా.. పడవ తెరచాపలు దెబ్బతినడంతో సముద్రంలో దిక్కుతోచని స్థితిలో పడవ కొట్టుకుపోయింది. అధికారులు రంగంలోకి దిగి కాపాడారు.

సముద్రంలో 460 మైళ్ల దూరంలో..

ఆగస్టు 20న వృద్ధుడితో సంబంధాలు తెగిపోయాయి. అక్టోబర్ 24న అతను గమ్యస్థానానికి చేరుకోలేదని అధికారులకు సమాచారం అందడంతో గాలింపు ప్రారంభించారు. ఈ క్రమంలో అక్టోబర్ 27న పడవ నుంచి అత్యవసర బీకన్ సంకేతాలు అందాయి. దీంతో కోస్ట్‌గార్డ్ విమానాలు, నౌకలను రంగంలోకి దించింది. ఆ రోజు సాయంత్రం శాన్ డియాగో తీరానికి సుమారు 460 మైళ్ల దూరంలో 'విల్లో విండ్' పడవను గుర్తించారు. మరుసటి రోజు ఉదయం 'గ్రాండ్ ఓరియన్' అనే వాణిజ్య నౌక పడవ వద్దకు చేరుకుంది. అయితే సముద్రంలో అలలు ఉద్ధృతంగా ఉండటంతో తొలుత వృద్ధుడిని, కుక్కను రక్షించడం సాధ్యం కాలేదు. ఆ తర్వాత అదే రోజు నౌక సిబ్బంది వారిద్దరినీ



సురక్షితంగా తమ నౌకలోకి తీసుకున్నారు. దెబ్బతిన్న తెరచాపలతో పడవను సముద్రంలోనే వదిలేశారు.

అక్టోబర్ 29న కాలిఫోర్నియాలోని వెంచురాకు పశ్చిమాన సుమారు 170 మైళ్ల దూరంలో గ్రాండ్ ఓరియన్ నౌక నుంచి కోస్ట్‌గార్డ్ హెలికాప్టర్ సిబ్బంది వృద్ధుడిని, అతని కుక్కను తీసుకెళ్లారు. అనంతరం వారిని శాన్ డియాగోకు తరలించారు. వృద్ధుడిని వైద్య పరీక్షల నిమిత్తం స్క్రిప్స్ మెర్సీ ఆసుపత్రిలో చేర్చారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై కోస్ట్‌గార్డ్ మరిన్ని వివరాలను వెల్లడించలేదు.

ఈ రెస్క్యూ ఆపరేషన్ విజయవంతం కావడంలో సహకరించిన వాణిజ్య నౌక సిబ్బంది, కోస్ట్‌గార్డ్ బృందాలను ఆ సంస్థ కమాండర్ జేసన్ న్యూయెన్ అభినందించారు. సముద్ర ప్రయాణాలు చేసేవారు అత్యవసర సమాచార పరికరాలను వెంట ఉంచుకోవడంతోపాటు, తమ ప్రయాణ వివరాలను తీరంలోని వారికి ముందుగానే తెలియజేయాలని సూచించారు.

ట్రంప్ ఓటమి.. మస్క్‌కు భారీ షాక్..

ఫండింగ్ రూ.4,200 కోట్లు.. సంపదకు రూ.5 లక్షల కోట్లు లాస్?

ముద్ర, డెస్క్:

అమెరికా మధ్యంతర ఎన్నికలు ప్రపంచ రాజకీయాల్లోనే కాదు.. అంతర్జాతీయ వ్యాపార రంగంలోనూ ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఎదురుదెబ్బ తగలడం, కాంగ్రెస్‌పై డెమొక్రాట్లు పట్టు సాధించడం ఒక ఎత్తయితే.. ఈ ఎన్నికల్లో రిపబ్లికన్ల గెలుపు కోసం భారీగా ఖర్చు చేసిన టెక్ దిగ్గజం ఎలాన్ మస్క్‌కు ఎదురైన పరిణామాలు ఇప్పుడు మరో ఆసక్తికర చర్చకు తెరలేపాయి. రాజకీయంగా పెట్టిన పెట్టుబడి ఫలించకపోగా.. ఆయన సంపదపైనా భారీ ప్రభావం పడినట్లు వార్తలు వస్తున్నాయి.

రాజకీయాల్లోకి కార్పొరేట్ శక్తి.. మస్క్ భారీ పందెం!

ఎలాన్ మస్క్ అంటే ఒకప్పుడు టెస్లా, స్పేస్‌ఎక్స్, టెక్నాలజీ రంగాల్లో విప్లవాత్మక మార్పులకు మారుపేరు. కానీ ఇటీవల అమెరికా రాజకీయాల్లోనూ ఆయన ప్రభావం గణనీయంగా పెరిగింది. ముఖ్యంగా డొనాల్డ్ ట్రంప్‌కు బలమైన మద్దతుదారుగా నిలిచిన మస్క్.. రిపబ్లికన్ పార్టీ ఎన్నికల ప్రచారానికి భారీగా నిధులు సమకూర్చినట్లు కథనాలు వెలువడ్డాయి.

ఈ మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్ల తరపున ఆయన సుమారు 446 మిలియన్ డాలర్లు ఖర్చు చేసినట్లు అంచనా. భారత కరెన్సీలో ఇది దాదాపు రూ.4,200 కోట్లకు



సమానం. ఎన్నికల ప్రచారంలో అత్యధికంగా నిధులు సమకూర్చిన వ్యక్తుల్లో మస్క్ ముందున్నారు. కాంగ్రెస్‌పై రిపబ్లికన్ల పట్టు కొనసాగాలన్న లక్ష్యంతో ఆయన చేసిన ఈ భారీ ఖర్చు ఇప్పుడు చర్చనీయాంశమైంది.

గెలుపు కోసం పెట్టిన వేల కోట్లు.. ఫలితం మాత్రం రివర్స్!

ఎన్నికల ఫలితాలు మస్క్ ఆశించిన దిశలో రాలేదు. డెమొక్రాట్లు ప్రతినిధుల సభతో పాటు సెనేట్‌లోనూ ఆధిపత్యం సాధించినట్లు వెలువడిన ఫలితాలు రిపబ్లికన్లకు గట్టి ఎదురుదెబ్బగా మారాయి. దీంతో ట్రంప్ రాజకీయ ప్రాబల్యానికి మాత్రమే కాకుండా.. ఆయనకు అండగా నిలిచిన మస్క్ రాజకీయ వ్యూహానికీ పరీక్ష ఎదురైంది.

ముఖ్యంగా టెక్సాస్‌లో రిపబ్లికన్లకు ఎదురైన పరాజయం మస్క్ రాజకీయ పెట్టుబడిపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఎన్నికల ప్రచారంలో ఆయన అధికంగా దృష్టి పెట్టిన ప్రాంతాల్లో ఇదొకటి కావడం గమనార్హం.

ఒక్కరోజులోనే సంపదకు భారీ దెబ్బ?

ఎన్నికల ఫలితాల తర్వాత మార్కెట్లలో చోటుచేసుకున్న పరిణామాలు మస్క్ సంపదపై ప్రభావం చూపినట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. టెస్లా షేర్లు 5.7 శాతం పడిపోయినట్లు, స్పేస్‌ఎక్స్ విలువ కూడా తగ్గినట్లు కొన్ని మార్కెట్ నివేదికలు వెల్లడించాయి.ఈ పరిణామాల నేపథ్యంలో మస్క్ సంపదలో 60 బిలియన్ డాలర్లకు పైగా తగ్గుదల నమోదైనట్లు కథనాలు వస్తున్నాయి. భారత కరెన్సీలో ఇది దాదాపు రూ.5 లక్షల కోట్లకు పైమాటే. అయితే ఈ తగ్గుదలను ఎన్నికల ఫలితాలకే పూర్తిగా ఆపాదించలేం. మార్కెట్ పరిస్థితులు, కంపెనీల విలువల్లో మార్పులు, పెట్టుబడిదారుల అంచనాలు కూడా ఇందుకు కారణమై ఉండవచ్చు.

మస్క్‌కు ఇదో రాజకీయ గుణపాఠమా?

వ్యాపార రంగంలో తన నిర్ణయాలతో ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచిన ఎలాన్ మస్క్.. రాజకీయాల్లోనూ అదే స్థాయిలో ప్రభావం చూపాలని ప్రయత్నించారు. కానీ ఎన్నికల ఫలితాలు మరో విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. ఎంతటి సంపద, ఎంతటి ప్రచార బలం ఉన్నా.. ఓటరు నిర్ణయాన్ని పూర్తిగా ప్రభావితం చేయడం అంత సులభం కాదు.కార్పొరేట్ దిగ్గజాలు రాజకీయాల్లో పెట్టే భారీ పెట్టుబడులు తమకు అనుకూలమైన ఫలితాలను హామీ ఇవ్వలేవనే చర్చ మరోసారి మొదలైంది. ట్రంప్‌కు మద్దతుగా మస్క్ పెట్టిన రాజకీయ పందెం ఆశించిన ఫలితాన్ని ఇవ్వకపోవడం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఆసక్తికర అంశంగా మారింది.అమెరికా ఎన్నికల్లో డెమొక్రాట్ల విజయం రాజకీయ సమీకరణాలను మార్చడమే కాకుండా, ఎలాన్ మస్క్ వంటి బిలియనీర్ల రాజకీయ వ్యూహాలపైనా కొత్త ప్రశ్నలు లేవనెత్తుతోంది. డబ్బుతో రాజకీయ ప్రభావాన్ని కొనుగోలు చేయవచ్చా? లేక అంతిమ నిర్ణయం ఓటరు చేతుల్లోనే ఉంటుందా? అమెరికా ఎన్నికల ఫలితాలు మరోసారి ఈ ప్రశ్నను తెరపైకి తెచ్చాయి.

ఈ భారతీయుడి అధ్యక్ష కలలను కల్లలు చేసింది..

ముద్ర, డెస్క్:

అమెరికా రాజకీయాలలో భారతీయ సంతతి వ్యక్తి వివేక్ రామస్వామి సంచలన రాజకీయ నాయకుడిగా ఎదిగారు. భవిష్యత్తు కాలంలో రిపబ్లికన్ అధ్యక్ష అభ్యర్థిగా అతడు నిలబడతాడని ప్రచారంలో కూడా ఉంది. అయితే ఈయన అమెరికా మిడ్ టర్మ్ ఎన్నికల్లో ఓహియో గవర్నర్ పదవికి పోటీ చేసి ఓడిపోయారు. ఈయన డెమోక్రటిక్ అభ్యర్థి అమీ యాక్టన్ చేతిలో ఓడిపోయారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కు ఈయన అత్యంత దగ్గర వ్యక్తి. ట్రంప్ రూపొందించిన మాగా విధానాల వెనక వివేక్ ఉన్నాడని అంతర్జాతీయ మీడియాలో ప్రచారం జరిగింది. వివేక్ ఓడిపోవడం పట్ల రిపబ్లికన్ పార్టీ నేతలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

ఓహియో కు స్వింగ్ స్టేట్ అనే పేరు ఉంది అయితే ఇక్కడ వివేక్ ఓడిపోవడం వెనక ట్రంప్ కారణమని తెలుస్తోంది. దేశంలో ధరలు పెరిగిపోవడం.. ట్రంప్ వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం.. ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడం వల్ల ఓటర్లు విసుగు చెందారు. అందువల్ల ఓటర్లు రిపబ్లికన్ల వైపు ఆసక్తి చూపించలేదు. వివేక్ రామస్వామి కూడా వ్యాపారవేత్తగా కాకుండా.. ట్రంప్ నీడలో ఉన్న వ్యక్తిగానే



ప్రచారం చేశారు. స్థానికంగా ఉన్న సమస్యల మీద ఆయన దృష్టి పెట్టలేదు. తన ప్రచారంలో జాతీయస్థాయి అంశాల మీద మాట్లాడారు. వివాదాస్పద అంశాల గురించి దృష్టి పెట్టారు . ఇవి ఆయన విజయావకాశాలను తీవ్రంగా దెబ్బతీశాయి.

ఈ ఓటమితో వివేక్ భవిష్యత్తు ఏమవుతుందని ఆందోళన మొదలైంది. ఆయన అమెరికా అధ్యక్ష రేసులో ఉండేది అనుమానమే అనే ప్రశ్నలు వ్యక్తం అవుతున్నాయి. 2024లో రిపబ్లికన్ పార్టీ తరపున అధ్యక్ష ప్రైమరీలలో వివేక్ పోటీ చేశారు. గుర్తింపు కూడా పొందారు. 2028 వైట్ హౌస్ రేసులో రిపబ్లికన్ తరపున ప్రధాన పోటీదారిగా ఉంటాడని అందరూ అనుకున్నారు. సొంత రాష్ట్రమైన ఓహియో లోనే ఆయన గవర్నర్ గా గెలవలేకపోయారు . ఇలాంటి సమయంలో జాతీయస్థాయిలో దేశ అధ్యక్షుడిగా ఓట్లు సాధించడం అనుమానమేనని విశ్లేషకులు చెబుతున్నారు. ఈ పరిణామం ఓటర్ల మనో గతాన్ని.. విరాళాలు ఇచ్చే దాతలను ప్రభావితం చేస్తుందని వారు చెబుతున్నారు.

ఇప్పుడు ఉన్న పరిస్థితుల్లో వివేక్ భవిష్యత్ కాలంలో అధ్యక్షుడు కావడం దాదాపు అసాధ్యం. సొంత రాష్ట్రంలో ఆయన పట్టు కోల్పోయారు. ఇలాంటి వ్యక్తులకు సొంత పార్టీలో నేషనల్ కమిటీ అధ్యక్షుడిగా నామినేషన్ ఇవ్వడం దాదాపుగా కష్టం. వచ్చే రోజుల్లో ఆయన మీడియా విశ్లేషకుడి పాత్ర లేదా కార్పొరేట్ రంగానికి మాత్రమే పరిమితం కావాల్సి ఉంటుంది. ఒకవేళ భవిష్యత్తు కాలంలో మళ్ళీ అధ్యక్ష రేసులకి రావాలి అనుకుంటే.. ప్రత్యర్థులు ఓహియో పలితాన్ని తెర ముందు పెట్టే ప్రమాదం ఉంది.

600 మిలియన్ల డాలర్లు ఇవ్వండి..

కోర్టును ఆశ్రయించిన మైఖేల్ జాక్సన్ కుమార్తె



ముద్ర, లాస్ ఏంజిల్స్:

పాప్ స్టార్ మైఖేల్ జాక్సన్ మృతిచెంది 17 ఏళ్లు అవుతోంది. ఆ మూన్‌వాకర్ తన ముగ్గురు పిల్లలకు ట్రస్టు రాసిచ్చేశాడు. అయితే మైఖేల్ జాక్సన్ కుమార్తె పారిస్ జాక్సన్ ఇప్పుడు కోర్టును ఆశ్రయించారు. సింగర్ జాక్సన్‌కు చెందిన ఎస్టేట్ నుంచి సుమారు 600 మిలియన్ల డాలర్లను ట్రస్టుకు బదిలీ చేయాలని పారిస్ జాక్సన్ లాస్ ఏంజిల్స్ కోర్టులో కేసు వేసింది. మైఖేల్ జాక్సన్ మ్యూజిక్ డీల్స్, ప్రాపర్టీ సేల్స్ ద్వారా ఎస్టేట్‌కు బిలియన్ల డాలర్ల ఆదాయం వస్తోందని, కానీ ఫ్యామిలీ ట్రస్టుకు ఎటువంటి రాబడి లేదని, అందుకే ఎస్టేట్ ఆదాయంలోని 600 మిలియన్ల డాలర్లను ఫ్యామిటీ ట్రస్టుకు బదిలీ చేయాలని పారిస్ జాక్సన్ కోరింది. కానీ ఎస్టేట్ నిర్వాహకులు మాత్రం ఆ అభ్యర్థనను తిరస్కరిస్తున్నారు. న్యాయపరమైన చిక్కులు చాలా ఉన్నాయని, అవి తీరే వరకు ట్రస్టుకు డబ్బులు ఇవ్వలేమని ఎంజే ఎస్టేట్ నిర్వాహకులు చెప్పేశారు. మైఖేల్ జాక్సన్ 2009 జూన్‌లో 50 ఏళ్ల వయసులో చనిపోయారు. ఆయనకు ముగ్గురు పిల్లలు ప్రిన్స్, పారిస్, బిగి ఉన్నారు. పారిస్ జాక్సన్ ప్రస్తుతం 28 ఏళ్లు ఉన్నది. అయితే పిల్లలు 21 ఏళ్లకు చేరుకున్న తర్వాత ట్రస్టు ఆదాయంలో ఒక్కొక్కరికి షేర్ ఇవ్వాల్సి ఉంటుంది. వయసు దాటినా ట్రస్టు నుంచి కావాల్సిన డబ్బులు అందడం లేదని ఆరోపణలు ఉన్నాయి.

అమెరికా సిటీబ్యాంక్ క్యాంపస్‌లో కాల్పులు..

ఇద్దరు మృతి



ముద్ర, ఫ్లోరిడా: అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రంలో ఉన్న సిటీబ్యాంక్ ఆఫీసు క్యాంపస్‌లో కాల్పులు ఘటన జరిగింది. ఓ ఆగంతకుడు తన కారుతో క్యాంపస్‌లోకి దూసుకువచ్చాడు. టంపా సమీపంలో ఉన్న బ్రాండన్ సిటీబ్యాంక్ స ఎంటర్‌లో ఈ ఘటన జరిగింది. లంచ్ సమయంలో దూసుకువచ్చిన అతను కారులో నుంచి ఏఆర్ స్టయిల్ భారీ రైఫిల్‌ను తీసి కాల్పులు జరిపాడు. ఆ కాల్పుల్లో ఓ మహిళా ఉద్యోగి మృతిచెందింది. ఇక ఆ సాయుధుడిని అక్కడ పనిచేస్తున్న సెక్యూర్టీ గార్డు కాల్చేశాడు. మహిళతో పాటు షూటర్ మృతిచెందగా, మరో నలుగురు వ్యక్తులు గాయపడ్డారు.ఈ ఘటన తర్వాత పందల సంఖ్యలో పోలీసులు సిటీబ్యాంక్ సెంటర్‌కు చేరుకున్నారు. కాల్పులు జరిగిన సమయంలో బ్యాంకులో సుమారు 3200 మంది పనిచేస్తున్నట్లు తెలిసింది. సెక్యూర్టీ ఫెన్సింగ్‌ను కారుతో ఢీకొట్టి.. ఔట్‌డోర్ డైనింగ్ ప్రాంతానికి దుండగుడు దూసుకువచ్చాడు. ఉద్యోగులు లంచ్ చేస్తున్న ప్రాంతంలో బీభత్సం సృష్టించాడు. గన్‌తో డైనింగ్ ఏరియాలో తిరుగుతున్న సాయుధుడి వీడియో వైరల్ అవుతోంది.అయితే బిల్డింగ్ కేఫటేరియాలోకి ప్రవేశించిన షూటర్‌ను సిటీబ్యాంక్ సెక్యూర్టీ గార్డు కాల్చాడు. ఇద్దరి మధ్య గన్‌ఫైర్ జరిగింది. గార్డు కాల్పులకు షూటర్ కిందపడిపోయాడు. అతన్ని టంపా ఆస్పత్రికి తరలించారు. కానీ అతను మృతిచెందినట్లు డాక్టర్లు తేల్చారు.

కేరళలో పుట్టింది.. లాస్ ఏంజిల్స్ మేయర్ కాబోతోంది.. ఎవరీ నిత్యారామన్?



ముద్ర, లాస్ ఏంజిల్స్: అమెరికా మధ్యంతర ఎన్నికల్లో అనేకమంది భారత సంతతి వ్యక్తులు విజయం సాదించారు. కేరళలో పుట్టిన నిత్యా రామన్(Nithya Raman) .. లాస్ ఏంజిల్స్ మేయర్ రేసులో ముందున్నారు. కేరన్ బాస్‌పై ఆమె గెలుపు ముంగిట నిలిచారు. దాదాపు 52 శాతం ఓట్లు ఆమెకు పోలయ్యాయి. దీంతో లాస్ ఏంజిల్స్ నగరానికి తొలి ఏషియన్–అమెరికన్ మేయర్‌గా నిత్యా రామన్ రికార్డు క్రియేట్ చేశారు. తాజా సమాచారం ప్రకారం నిత్యా రామన్‌కు 51.1 శాతం ఓట్లు పోలయ్యాయి. బాస్‌కు 48.33 శాతం ఓట్లు పడినట్లు తెలుస్తోంది. తోటి డెమోక్రటిక్ నేత అయిన కేరన్ బాస్‌తో పోటీపడేందుకు చివరి నిమిషంలో నిత్యా రామన్ నిర్ణయించారు. ఆమె ఆకస్మిక ఎంట్రీతో అనేక మంది నేతలు షాకయ్యారు. అప్పటి వరకు బాస్‌కు సపోర్టు ఇచ్చిన ఆమె.. అనూహ్య రీతిలో మేయర్ రేసుకు పోటీపడ్డారు. బాస్ మేయర్‌గా ఉన్న సమయంలో లాస్ ఏంజిల్స్‌లో వైల్డ్‌ఫైర్లు, హాలీవుడ్‌లో ఉద్యోగాల కోత లాంటి సమస్యలు ఎదురయ్యాయి. అయితే నగరంలో గుంతల్ని పూడ్చడం, వీధి దీపాలను వెలిగేలా చేస్తానని ఆమె వాగ్దానాలు చేశారు. రామన్ తన ఎన్నికల ప్రచారంలో.. మున్సిపల్ సౌకర్యాలను కల్పించనున్నట్లు ప్రామిస్ చేశారు. అయితే నిత్యా రామన్‌కు కెన్నెత్ మేజా సపోర్టు ఇవ్వడంతో ఆమె పోరు ఆసక్తికరంగా మారింది. రామన్, మేజా.. ఇద్దరూ కలిసి ప్రచారం నిర్వహించారు. ట్రంప్ పాలన ముగిసే సమయంలో లాస్ ఏంజిల్స్ మేయర్‌గా రామన్ చేయనున్నారు. 2028 ఒలింపిక్స్ నిర్వహణ బాధ్యతలు కూడా నిత్యా రామన్ చేతికి చిక్కనున్నాయి.

నిత్యా రామన్ 1981లో కేరళలో పుట్టారు. ఆరేళ్ల వయసులో ఆమె అమెరికాకు వలస వెళ్లారు. 22 ఏళ్ల వయసులో ఆమె అమెరికా పౌరురాలిగా మారారు. హార్వర్డ్ యూనివర్సిటీ నుంచి బ్యాచిలర్స్ డిగ్రీ చేశారు. మసాచుసెట్స్ ఇన్స్‌టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి అర్బన్ ప్లానింగ్‌లో ఆమె మాస్టర్స్ డిగ్రీ చేశారు. ట్రాన్స్‌పరెంట్ చెన్నె అనే అర్బన్ రీసర్చ్ గ్రూపును ఆమె స్థాపించారు.2013లో నిత్యా రామన్ లాస్ ఏంజిల్స్‌కు మారారు. సిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కోసం ఆమె పనిచేశారు. టైమ్స్ అప్ ఎంటర్‌టైన్మెంట్‌లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఆమె చేశారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శుక్రవారం 6.11.2026
www.mudranews.in | @mudranews

నూనె పరిమాణాన్ని నియంత్రించండి!



మంచి నూనె అయినా ఎక్కువగా తీసుకుంటే శరీరానికి అధిక కేలరీలు చేరుతాయి. డీప్ ఫ్రై వంటకాలను తగ్గించి, ఉడికించడం, ఆవిరిపై వండటం, గ్రిల్ చేయడం వంటి పద్ధతులకు ప్రాధాన్యత ఇవ్వాలి. నూనెను పరిమితంగా ఉపయోగించడం గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది.

కరీంనగర్ KFCపై ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

ముద్ర, కరీంనగర్ : కరీంనగర్ నగరంలోని KFC ఫుడ్ సెంటర్ పై ఆహార భద్రతా అధికారులు గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నిబంధనల ప్రకారం శుభ్రత పాటించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలోని వివిధ ఆహార పదార్థాల నమూనాలను స్వాధీనం చేసుకొని, నాణ్యతా పరీక్షల కోసం ల్యాబ్ కు పంపినట్లు అధికారులు తెలిపారు. నివేదిక రాగానే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

పచ్చిగుడ్ల మయోనైజ్‌పై నిషేధం

ముద్ర, కరీంనగర్ : తెలంగాణ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది.. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా పచ్చిగుడ్లతో తయారుచేసే మయోనైజ్ ఉత్పత్తి, నిల్వ విక్రయాలపై ఏడాది పాటు పూర్తి స్థాయి నిషేధం విధిస్తూ రాష్ట్ర ఆహార భద్రతా కమిషనర్ (ఉత్తర్వులు జారీ చేశారు. ఆహార భద్రత మరియు ప్రమాణాల చట్టం, 2006 లోని సెక్షన్ 30(2)(ఎ) ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు స్పష్టం చేశారు.అయితే,ఈ నిషేధాజ్ఞలు 2026 అక్టోబర్ 30వ తేదీ నుంచే తక్షణమే అమల్లోకి వచ్చాయి. నాటి నుంచి ఏడాది పాటు ఈ నిషేధం కొనసాగుతుంది. ఈ ఉత్తర్వులకు సంబంధించిన అధికారిక గెజిట్ నోటిఫికేషన్ (నంబర్ 984) ను 2026 నవంబర్ 4వ తేదీన జారీ చేశారు. పచ్చిగుడ్లతో తయారుచేసే మయోనైజ్ వినియోగం వల్ల ఆహార కాలుష్యం (Food poisoning), తీవ్ర అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉన్నందున ప్రజల క్షేమార్థం ఈ చర్యలు చేపట్టినట్లు ప్రభుత్వం పేర్కొంది.--- పచ్చిగుడ్లతో తయారుచేసే మయోనైజ్ వినియోగం వల్ల ఆహార కాలుష్యంతో పాటు.. తీవ్ర అనారోగ్య సమస్యలు తలెత్తిన ఘటనలపై దృష్టి సారించిన ప్రభుత్వం.. ఏడాది పాటు నిషేధం విధించింది..

11 ఏళ్ల బాలుడిపై మౌల్సాబ్ లైంగిక వేధింపులు..

ముద్ర, హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలోని పాతబస్తీ మదన్నపేట పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణ ఘటన వెలుగుచూసింది. మదర్సాలో చదువుకుంటున్న 11 ఏళ్ల మైనర్ బాలుడిపై అరబిక్ బోధించే మౌల్సాబ్ లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.

అసలేం జరిగిందంటే?

కుర్మగూడలోని ఫాతిమా మసీదు మొదటి అంతస్తులో బాబా షరీఫుద్దీన్ మదర్సా కొనసాగుతోంది. బాధిత బాలుడు ఇక్కడే అరబిక్ పాఠాలు నేర్చుకుంటున్నాడు. రోజూలాగే మదర్సా ముగిసిన తర్వాత ఇంటికి బయలుదేరిన బాలుడిని, అరబిక్ బోధించే మౌల్సాబ్ తిరిగి పై అంతస్తుకు పిలిచాడు. అనంతరం మసీదు ఇన్‌చార్జ్ అబ్బాస్ గదిలోకి తీసుకెళ్లి, మొబైల్ ఫోన్‌లో అశ్లీల వీడియోలు చూపించాడు. ఆ తర్వాత బాలుడి ప్రైవేట్ భాగాలను తాకుతూ తీవ్ర అసభ్యంగా ప్రవర్తించాడని సమాచారం. ఈ విషయాన్ని ఎవరికైనా చెబితే తీవ్ర పరిణామాలు ఉంటాయంటూ బాలుడిని బెదిరించాడు.

ఇందుర్తిలో ఉచిత కంటి వైద్య శిబిరం



ముద్ర, చిగురుమామిడి : చిగురుమామిడి మండలంలోని ఇందుర్తి గ్రామంలో మానేరు లయన్స్ క్లబ్, డాక్టర్ భాస్కర్ మాదేకర్ ఉదార నేత్రవైద్యశాల చారిటబుల్ ట్రస్ట్ రేకుర్తి సంయుక్త ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 124 మంది కంటి పరీక్షల సమస్యలపై వైద్య పరీక్షలు నిర్వహించుకున్నారు. అందులో 30 మంది కంటి సమస్య కలిగిన వారిని గుర్తించి డాక్టర్ మాదేకర్ రాజభాస్కర్ ఉచిత నేత్ర వైద్యశాల రేకుర్తి కంటి ఆసుపత్రికి తరలించారు.వారికి ఉచితంగా కంటి పరీక్షలు గ్రహించడం జరుగుతుందని వైద్య బృందం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై జగదీశ్వర్, సర్పంచ్ చింతపూల నరేందర్, మానేరు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లయన్ వారాల జగన్, కార్యదర్శి లయన్ పెద్ది శరత్ కుమార్, కోశాధికారి లయన్ ఆడెపు సంపత్, జిల్లా ప్రతినిధులు లయన్ వేముల విష్ణుమూర్తి, లయన్ గట్టు రాజయ్య గ్రామస్తులు పాల్గొన్నారు. కాగా ఈ ఉచిత వైద్య శిబిరానికి గ్రామానికి చెందిన లయన్ గట్టు రాజయ్య సర్పంచ్ చింతపూల నరేందర్ వైద్య శిబిరానికి పూర్తి సహాయ సహకారాలు అందించినట్లు వైద్య బృందం తెలిపారు.

రామగుండం ఎమ్మెల్యే, సీఐల నియంత పోకడలు

సీపీఐ జాతీయ నాయకులు చాడ వెంకట్ రెడ్డి




ముద్ర, రామగుండం : రామగుండం ఎమ్మెల్యే మక్కాన్సింగ్, గోదావరిఖని వన్ టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి నియంత పోకడలు తగ్గించుకోవాలని, లేదంటే కమ్యూనిస్టుల నుంచి ప్రతిఘటన తప్పదని సీపీఐ జాతీయ నాయకులు, మాజీ ఎమ్మెల్యే చాడా వెంకటరెడ్డి స్పష్టం చేశారు. కూల్చివేతల బాధితులకు న్యాయం చేయాలని ఇటీవల గోదావరిఖని చౌరస్తాలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న సీపీఐ ఫ్లోర్ లీడర్ మార్కపురి సూర్య, పార్టీ కార్యకర్తలపై వన్ టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి విచక్షణరహితంగా జనం చూస్తుండగానే మెడలు పట్టి బట్టలు చింపి అసభ్య పదజాలంతో ఈడ్చుకెళ్లి అక్రమ కేసు బనాయించడం దుర్మార్గపు చర్య అన్నారు. జరిగిన సంఘటనపై గురువారం పార్టీ శ్రేణులను అడిగి తెలుసుకొన్న ఆయన తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.ప్రజా పోరాటాలలో కమ్యూనిస్టులు ఎప్పుడూ ముందుంటారని తెలిపారు. ఎల్బీ నగర్, తిలక్ నగర్ లో 40 ఏండ్లుగా0 ఉంటున్న దుకాణాలను రోడ్డు వెడల్పు సాకుతో కూల్చివేయడం, ఆ తర్వాత మేయర్, సింగరేణి జీఎంలు కొబ్బరికాయలు కొట్టి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి భూమిపూజ చేయడం అంత నాటకీయమా అని ప్రశ్నించారు. తీరా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం పూర్తయ్యాక అనుమతులు లేవని సింగరేణి అధికారులతో మళ్లీ కూల్చివేయించడం విడ్డూరంగా ఉందన్నారు. దుకాణదారుల పొట్ట కొట్టినందుకు ప్రశ్నించిన సీపీఐ ప్రజాప్రతినిధిపై అక్రమ కేసు బనాయించడం సమంజసం కాదన్నారు. ప్రజలకు అన్యాయం చేస్తామంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఆయన వెంట సీపీఐ నాయకులు తాండ్ర సదానందం, మార్కపురి సూర్య, శనిగరపు చంద్రశేఖర్, మానస్కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేవంత్ రెడ్డి చీకటి జీవో జారీ చేసిండు

- ఎమ్మెల్యే గంగుల కమలాకర్

ముద్ర, కరీంనగర్ : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ మా కడుపు నిండా అన్నం పెట్టి కాపాడారని.. కానీ బీసీ వ్యతిరేకంగా ఉన్న రేవంత్ రెడ్డి చీకటి జీవో జారీ చేసిండని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఫైర్ అయ్యారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వేదిక మీదున్న మాతోపాటు ఉన్న మధుసూదనాచారి, శ్రవణ్ కుమార్, వివ్ వివేకానంద, ఎమ్మెల్యేలతోపాటు మేమంతా కూడా బీసీ బిడ్డలం.. ఒకసారి మీకు గత చరిత్రను పత్రికల ద్వారా ప్రజలకు చెప్పాల్సిన అవసరముందన్నారు.

కిరణ్‌కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 2011–12 సంత్సరంలో పొన్నం ప్రభాకర్ కూడా బీసీ సంఘాల్లో తిరిగిండు.. నేను కూడా బీసీ సంఘాల్లో తిరిగానని ఎమ్మెల్యే గంగుల గుర్తు చేశారు. ఆనాడు సీఎం కిరణ్ కుమార్ ఈ హైదరాబాద్ నడిఒడ్డున బీసీ సంఘాలు సమావేశాలు ఏర్పాటు చేసుకుంటే.. మా బీసీ సంఘాలకు హోటళ్లలో కూడా మీటింగ్ ఉండదు కాబట్టి ఎక్కడన్నా చుట్టు పక్కల బీసీ సంఘాలకు 5 గుంటల భూమి ఇవ్వండి అంటే వెకిలిగా నవ్వి.. బీసీ సంఘాలకు ఒక ఆశ్రమం కావాలా..? అని నవ్విన పరిస్థితి ఉండేది. తిరుగగా తిరుగగా నాగార్జున సాగర్ రోడ్లులో 120 కిలోమీటర్ల దూరంలో 5 గుంటల భూమిని ఒక స్మశాన వాటిక పక్కన చూపించిన పరిస్థితి ఉన్నది.. అంటూ బీసీ సంఘాలకు గత కాంగ్రెస్ ప్రభుత్వమున్నప్పుడు



వెకిలిగా నవ్వి అవమానం చేసిన పరిస్థితి ఉండేదన్నారు.

కోకాపేటలో ఆత్మగౌరవ భవనాలు..

కనీసం సమావేశాలు ఏర్పాటు చేసుకుంటే హైదరాబాద్ లో ఒక గుంట భూమి కూడా లేని పరిస్థితి ఉంది. ఆ పరిస్థితి తెలుసుకుని కేసీఆర్ ముఖ్యమంత్రి కాగానే.. బీసీలంటే సమాజంలో 60–70 శాతమున్న వ్యక్తులు కాబట్టి మీ ఓట్లతోనే ప్రభుత్వాలు నడుస్తయి కాబట్టి మీ గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత మాది.--- ప్రప్రథమంగా, ఏ ప్రభుత్వం, ఏ రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రి కూడా చేయనటువంటి విధంగా ఆ రోజు 2018లో జీవో నంబర్ 189 ప్రకారం మీ గౌరవాన్ని కాపాడుతం..అందుకే దాని పేరు ఆత్మ గౌరవ భవనాలని చెప్పారని ఎమ్మెల్యే గంగుల స్పష్టం చేశారు.

భారతదేశంలో ఏ ముఖ్యమంత్రి కూడా చేయని సాహసం జీవో 189 ద్వారా 87.5 ఎకరాల భూమి.. ఆత్మగౌరవ భవన నిర్మాణాల కోసం ఆర్థిక ఇబ్బందులు రాకుండా ఆ డబ్బు కూడా నేను ఇస్తా అని చెప్పి ఎకరానికి కోటి రూపాయల చొప్పున 41 ఈ బీసీ కుల సంఘాలకు సుమారు 97.5 కోట్ల రూపాయలు మంజూరు చేశారన్నారు. ఎక్కడిస్తారని అంటే.. మీ గౌరవాన్ని కాపాడతా అని చెప్పి రూ.100–150 కోట్ల విలువైన కోకాపేటలో మా అందరికీ ఆత్మగౌరవ భవనాలు ఇచ్చారన్నారు. దాంతోపాటు ఉప్పల్ భగాయత్‌లో ఇచ్చారన్నారు. ఆ తర్వాత మా దగ్గరకు సంఘాలు వచ్చినయి.. మేం సంతోషపడ్డాం. ముఖ్యమంత్రి కూడా కడుపునిండా అన్నం పెట్టి మా గౌరవాన్ని కాపాడిండని మా అదృష్టంగా భావించామన్నారు.

కానీ బీసీ వ్యతిరేకంగా ఉన్న రేవంత్ ప్రభుత్వం చీకటి జీవో 14 ఇవ్వడం జరిగింది. ఇందులో పాత 189 జీవోను రద్దు చేస్తున్నం.. ఇక నుంచి మాదే గుత్తాధిపత్యం.. మళ్లీ మీరు బానిసలుగా బతకండి.. గతంలో మా హయాంలో మీరు బానిసలుగాఉన్నరు.. మళ్లీ మీరు బానిసలుగా ఉండండి.. మీ ఆత్మగౌరవ భవనాలు లేవు.. మేమే ఆధిపత్యం చేస్తమని జీవో నంబర్ 14 ఇవ్వడం జరిగింది. పొన్నం ప్రభాకర్ మీరు బీసీ బిడ్డ. బీసీ సంఘాల్లో తిరిగినం. ఈ జీవో ఇచ్చింది మీకు తెలుసా..? మీ డిపార్ట్‌మెంట్ ఇచ్చింది..మరి జీవో ఇచ్చినంక కూడా మీరు ఎందుకు పెదాలు మెదపడం లేదని ప్రశ్నించారు.

కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతు సమీకరణ

ముద్ర, హైదరాబాద్ : పట్టభద్రుల కోటాలో రెండు నియోజకవర్గాలకు జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతివ్వడానికి పలు మైనారిటీ విద్యా సంస్థలు సానుకూలత వ్యక్తం చేశాయని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని షబ్బీర్‌అలీ నివాసంలో ఏఐసీసీ ఇన్‌చార్జి కార్యదర్శి సచిన్ సావంత్, పీసీసీ ఉపాధ్యక్షుడు జాఫర్ జావీద్, హైదరాబాద్–రంగారెడ్డి–మహబూబ్‌నగర్ పట్టభద్రుల నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి సామ రామ్మోహన్‌రెడ్డి తదితరులతో రాష్ట్రంలోని పదిహేను మైనారిటీ విద్యాసంస్థల అధిపతులు సమావేశమయ్యారు. తమ విద్యాసంస్థలతో సంబంధం ఉన్న పట్టభద్రులను సంప్రదించి, ఎన్నికల్లో మద్దతు కోసం విజ్ఞప్తి చేయాలని యాజమాన్యాలను షబ్బీర్‌అలీ కోరారు. తమ పూర్వ విద్యార్థులను ఓటర్లుగా నమోదు చేయించాలన్నారు. విద్యాసంస్థల యజమానులు సానుకూలంగా స్పందించినందుకు షబ్బీర్‌అలీ ధన్యవాదాలు తెలిపారు.

దీపావళి వేళ చార్మినార్ పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు

ముద్ర, హైదరాబాద్ : దీపావళి పండుగ వేడుకల సందర్భంగా చార్మినార్‌లోని ప్రసిద్ధ శ్రీ భాగ్యలక్ష్మి ఆలయానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు కీలక ట్రాఫిక్ అడ్వైజరీని జారీ చేశారు. 2026 నవంబర్ 6వ తేదీ నుంచి 11వ తేదీ వరకు భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని చార్మినార్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. రద్దీ దృష్ట్యా చార్మినార్ వైపు వెళ్లే మూడు ప్రధాన మార్గాల్లో తీవ్ర ట్రాఫిక్ జామ్ ఏర్పడే అవకాశం ఉందని పోలీసులు పేర్కొన్నారు.

*** మదీనా నుంచి చార్మినార్**
*** ముర్గి చౌక్ నుంచి చార్మినార్**
*** షా అలీ బండ రాజేష్ మెడికల్ హాల్ నుంచి చార్మినార్**

ఈ నేపథ్యంలో సాధారణ వాహనదారులు పై మార్గాల్లో ప్రయాణించకుండా, ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని ట్రాఫిక్ విభాగం విజ్ఞప్తి చేసింది. ఆలయానికి వచ్చే భక్తులు ట్రాఫిక్ సూచికలను, విధుల్లో ఉండే సిబ్బంది ఆదేశాలను పాటిస్తూ నిర్దేశిత ప్రాంతాల్లోనే తమ వాహనాలను పార్కింగ్ చేయాలని సూచించారు.

భక్తుల కోసం కేటాయించిన పార్కింగ్ స్థలాలు:

మీర్‌చౌక్ ముఫీద్-ఉల్-అనామ్ స్కూల్ గ్రౌండ్ (బాలురు), సర్దార్ మహల్ రోడ్డు (స్కూల్ ఆటస్థలం వెనుక భాగం)

షా అలీ బండ చార్మినార్ బస్ టెర్మినల్ పార్కింగ్, యునానీ ఆసుపత్రి ప్రాంగణం

మదీనా, నయాపూల్ ఎస్‌వైజే (SYJ) కాంప్లెక్స్, కాళీ కమాన్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల (ఆదివారం మాత్రమే)



పురానాపూల్, బేగంబజార్ ఎంజే బ్రిడ్జ్, ప్రభుత్వ సిటీ కాలేజీ, కులీ కుతుబ్ షా (QQ) స్టేడియం

హుస్సేనీ ఆలం న్యూ ముర్గి చౌక్ ఖిల్వత్ రోడ్డు, జులూ ఖానా లాడ్ బజార్ (ఖిల్వత్ రోడ్డు), ఖిల్వత్ గ్రౌండ్

తాజా ట్రాఫిక్ అప్‌డేట్ల కోసం సామాజిక మాధ్యమాలు ఫేస్‌బుక్ (facebook.com/HYDTP), ఎక్స్ (twitter.com/HYDTP) ఖాతాలను పరిశీలించాలని అధికారులు కోరారు. అత్యవసర ప్రయాణ సాయం కోసం ట్రాఫిక్ హెల్ప్‌లైన్ నంబర్ 9010203626ను సంప్రదించాలని, నగర ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని ప్రజలను కోరారు.

పరిశోధనలకు కేంద్రంగా అంతరిక్షం

- మంత్రి శ్రీధర్‌బాబు

ముద్ర, హైదరాబాద్: అంతరిక్షం.. పరిశోధనలకు కేంద్రంగా మారిందని తెలంగాణ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ఎన్నో దేశాలు శాటిలైట్లను అంతరిక్షంలోకి పంపుతున్నాయని, పదేళ్లలో శాటిలైట్ల సంఖ్య 10 లక్షలకు చేరుకోవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నట్లు ఆయన చెప్పారు. కాస్మోసర్వ్ కార్యాలయాన్ని దిల్లీ నుంచి కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ వర్చువల్‌గా ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. నిరుపయోగ శాటిలైట్లను కక్ష్య నుంచి వెనక్కి తేవడం ముఖ్యమన్నారు.


దేశంలో తొలిసారి హైదరాబాద్ కేంద్రంగా ఈ తరహా ప్రయోగం చేపడుతున్నట్లు చెప్పారు. '' కాస్మోసర్వ్ కంపెనీ అంతరిక్షం నుంచి వ్యర్థాలు తెచ్చే సాంకేతికతను అభివృద్ధి చేస్తోంది. హైదరాబాద్ కేంద్రంగా ఎన్నో స్పేస్ కంపెనీలు పని చేస్తున్నాయి. వీటికి ప్రోత్సహించేందుకు స్పేస్‌టెక్ పాలసీ తీసుకొస్తాం. ఫ్యూచర్ సిటీలో స్పేస్ సిటీ ఏర్పాటు చేస్తాం'' అని అన్నారు.



భారీ ఫేక్ కాల్ సెంటర్ రాకెట్ గుట్టురట్టు..

అమెరికా పౌరులను మోసం చేస్తూ సంపాదన

ముద్ర, హైదరాబాద్: అమెరికా పౌరులను లక్ష్యంగా చేసుకుని వందల కోట్ల రూపాయల మేర మోసాలకు పాల్పడుతున్న భారీ నకిలీ కాల్ సెంటర్ ముఠా నెట్‌వర్క్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) హైదరాబాద్ జోనల్ కార్యాలయం ఛేదించింది. నకిలీ కాల్ సెంటర్ల ద్వారా సాగుతున్న మనీలాండరింగ్ దర్యాప్తులో భాగంగా హర్షిల్ నయన్ భాయ్ రావల్, జస్వంత్ సింగ్, చేతన్ ముంజాల్, ప్రణవ్ పిఠాదియా అనే నలుగురు నిందితులను మనీలాండరింగ్ నిరోధక చట్టం (PMLA)–2002 కింద నవంబర్ 3న ఈడీ అరెస్ట్ చేసింది. నాంపల్లిలోని పీఎంఎల్ఏ ప్రత్యేక న్యాయస్థానంలో వీరిని హాజరుపరచగా, న్యాయస్థానం వారికి జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. గతంలో ఇదే కేసులో వికాస్ నిమర్, తారాచంద్ నిమర్, మహ్మద్ ఇర్ఫాన్ అన్సారీలను అరెస్ట్ చేసి చంచల్‌గూడ సెంట్రల్ జైలుకు తరలించిన విషయం తెలిసిందే. తాజా అరెస్టులతో ఈ కేసులో ఈడీ అరెస్ట్ చేసిన వారి సంఖ్య మొత్తం ఏడుకు చేరింది. సుమారు రూ. 261 కోట్ల దోపిడీ: భారతీయ న్యాయ సంహిత (BNS) సెక్షన్లు 318, 336, 340, 61ల కింద నమోదైన కేసుల ఆధారంగా ఈడీ దర్యాప్తు



చేపట్టింది. భారత్ కేంద్రంగా నడుస్తున్న ఈ నకిలీ కాల్ సెంటర్ల ద్వారా జులై 2025 నుండి సెప్టెంబర్ 2026 మధ్య కాలంలోనే దాదాపు 27.39 మిలియన్ డాలర్లు (భారత కరెన్సీలో సుమారు రూ. 261 కోట్లు) దోచుకున్నట్లు వాట్సాప్ గ్రూపుల ద్వారా ఆధారాలు లభ్యమయ్యాయి. 1940ల కాలంలో జన్మించిన అమెరికా వృద్ధులను లక్ష్యంగా చేసుకుని ఈ ముఠా పెద్దఎత్తున మోసాలకు పాల్పడింది. ఈ ముఠాకు చెందిన వ్యక్తులు అమెరికా పౌరులకు ఫోన్లు చేసి, వారి ఖాతాల నుంచి అనుమానాస్పద లావాదేవీలు జరిగాయని భయపెట్టేవారు. యూఎస్ డ్రగ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడ్మినిస్ట్రేషన్ , డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్ , ఫెడరల్ ట్రేడ్ కమిషన్ (FTC), యూఎస్ ట్రెజరీ వంటి కీలక సంస్థల అధికారుల పేర్లతో నకిలీ ఐడీ కార్డులు, బ్యాడ్జీలు, నకిలీ కోర్టు పత్రాలు చూపి బెదిరింపులకు దిగేవారు. చట్టపరమైన చర్యల నుంచి తప్పించుకోవాలంటే నగదు, బంగారం, కొరియర్ ద్వారా క్యాష్ పార్శిళ్లు పంపాలని లేదా క్రిప్టోకరెన్సీ రూపంలో బదిలీ చేయాలని బలవంతం చేసేవారు. అమెరికాలో సేకరించిన ఈ సొమ్మును హాంకాంగ్, దుబాయ్ కంపెనీల ఖాతాలకు మళ్లించి, క్రిప్టోకరెన్సీ , హవాలా, అంగడియా మార్గాల ద్వారా భారత కరెన్సీలోకి మార్చేవారు.

సోదాల్లో కీలక ఆధారాలు స్వాధీనం

గతంలో పటియాలా, పూణే, చండీగఢ్‌లలో నిర్వహించిన సోదాల్లో మూడు లైవ్ కాల్ సెంటర్లలో 220 మంది పనిచేస్తుండగా గుర్తించారు. 65 మొబైల్ ఫోన్లు, 13 ల్యాప్‌టాప్‌లు, భారీగా డేటా ఉన్న డిజిటల్ పరికరాలను సీజ్ చేశారు. బాధితులను బెదిరించేందుకు జర్మనీ, ఫిన్లాండ్ దేశాల్లోని సర్వర్లను, ఆటో-డయలర్లను వాడినట్లు గుర్తించారు. 397 యూఎస్ బ్యాంక్ ఖాతాలు, 140 మంది అమెరికన్ల సోషల్ సెక్యూరిటీ నంబర్లు , డ్రైవింగ్ లైసెన్సుల వివరాలను ఈ ముఠా దుర్వినియోగం చేసినట్లు ఈడీ స్పష్టం చేసింది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
గురువారం 05.11.2026
www.mudranews.in | @mudranews

నూనెను మళ్లీ మళ్లీ వేడి చేయకండి



పూరీలు, పకోడీలు వేయించిన తర్వాత మిగిలిన నూనెను తిరిగి ఉపయోగించడం ఆరోగ్యానికి మంచిది కాదు. పదేపదే వేడి చేయడం వల్ల హానికరమైన ఆక్సీకరణ పదార్థాలు ఏర్పడవచ్చు. అందుకే వాడిన నూనెను మళ్లీ మళ్లీ ఉపయోగించకూడదు.

తుపాను బాధితులకు అండగా ఉంటాం

మంత్రి పొంగులేటి

ముద్ర ప్రతినిధి, ఖమ్మం, నవంబరు 5 : తుపాను ప్రభావంతో భారీగా పరద నీరు చేరి దెబ్బతిన్న ప్రాంతాల్లో రాష్ట్ర రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విస్తృతంగా పర్యటించారు. సత్తుపల్లి, దమ్మపేట మండలాల్లో తెగిన చెరువు కట్టలను, నీట మునిగిన పంట పొలాలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, కలెక్టర్లు దివాకర టీఎస్, అంకిత్‌లతో కలిసి బేతుపల్లి పెద్ద చెరువు ముంపు ప్రాంత పంట పొలాలను సందర్శించిన మంత్రి, వరద తీవ్రత, పంట నష్టంపై స్థానిక రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం దమ్మపేట మండలం నాగుపల్లి వద్ద మల్లెపూల వాగు ఉప్పొంగడంతో దెబ్బతిన్న పంటలను, ముసలి బంధం చెరువు కట్టకు గండ్లు పడిన ప్రాంతాన్ని పరిశీలించి అధికారులతో మాట్లాడారు. గండుగులపల్లి వాగు పరిసరాలు, దమ్మపేటలోని పేరంటాల చెరువు కట్టతో పాటు సత్తుపల్లిలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలోకి వరద నీరు చేరిన ప్రాంతాలను కూడా సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. దెబ్బతిన్న చెరువు కట్టలకు తక్షణమే మరమ్మతులు చేపడతామని, పంట నష్టం వివరాలు సేకరించి రైతులకు తగిన సహాయం అందిస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది సేవలు మరువలేనివి

ఎడతెరిపి లేని వర్షాలు, వరదలతో ప్రమాదకర



పరిస్థితులు నెలకొన్న వేళ ప్రాణాలకు తెగించి సహాయక చర్యల్లో పాల్గొన్న రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం (ఎస్డీఆర్ఎఫ్) సిబ్బంది సేవలు మరువలేనివని రాష్ట్ర రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కొనియాడారు. బేతుపల్లి చెరువు ఉప్పొంగిన ప్రాంతంతో పాటు పలు గ్రామాలకు వరద ముప్పు ఏర్పడిన సమయంలో ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది తక్షణమే స్పందించి చేపట్టిన సాహసోపేత చర్యలను అభినందించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో బాధితులను రక్షించే క్రమంలో అస్వస్థతకు గురై సత్తుపల్లి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎస్డీఆర్ఎఫ్ సిబ్బందిని మంత్రి పొంగులేటి పరామర్శించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కలెక్టర్లు దివాకర టీఎస్, అంకిత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, వారికి మెరుగైన వైద్యం అందేలా చూస్తామని భరోసా కల్పించారు.

బేతుపల్లి చెరువులో రెస్క్యూ ఆపరేషన్ విజయవంతం

వరద ఉధృతిలో చిక్కుకున్న 19 మంది రక్షణ



ముద్ర ప్రతినిధి, ఖమ్మం, నవంబరు 5 : బేతుపల్లి చెరువులో చోటుచేసుకున్న ప్రమాదకర పరిస్థితుల్లో ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది, మత్స్యకారులు సురక్షితంగా బయటపడ్డారు. చెరువులో వరద ఉధృతిలో చిక్కుకున్న 9 మంది మత్స్యకారులను రక్షించేందుకు వెళ్లిన ఎస్డీఆర్ఎఫ్, అగ్నిమాపక శాఖ సిబ్బంది బోట్లు కూడా వరద ప్రవాహంలో చిక్కుకోవడంతో ఆందోళన వ్యక్తమయ్యింది. ఈ ఘటనలో మొత్తం 10 మంది ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది, 9 మంది మత్స్యకారులు ప్రమాదంలో చిక్కుకున్నారు.సమాచారం అందుకున్న వెంటనే ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను స్వయంగా పర్యవేక్షించారు. అత్యవసర సమయాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై దృష్టి సారించి, అదనపు సహాయక బృందాలను రంగంలోకి దించారు. వివిధ శాఖల మధ్య సమర్థవంతమైన సమన్వయం ఏర్పాటు చేస్తూ అందరినీ సురక్షితంగా ఒడ్డుకు చేర్చేందుకు చర్యలు చేపట్టారు. పరిస్థితిని నిశితంగా సమీక్షించారు. సహాయక చర్యల పురోగతిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ అధికారులకు తగిన సూచనలు, మార్గనిర్దేశం చేశారు.అధికారుల సమయస్ఫూర్తి, సమర్థవంతమైన పర్యవేక్షణతో సహాయక బృందాలు సాహసించి అందరినీ సురక్షితంగా ఒడ్డుకు చేర్చాయి. రక్షించబడిన వారందరినీ మెరుగైన వైద్య పరీక్షల నిమిత్తం సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాణాపాయం తప్పడంతో పోలీసు శాఖ, ప్రభుత్వ యంత్రాంగం, బాధితుల కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులను నిర్వర్తించిన పోలీసు, ఎస్డీఆర్ఎఫ్, అగ్నిమాపక శాఖ సిబ్బంది చొరవను కలెక్టర్, ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. అధికారుల సకాల స్పందనతో ఒక పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు కొనియాడుతున్నారు.

నవజాత శిశు మరణాల రేటు తగ్గించడమే లక్ష్యం

జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి
సంకల్ప్ అమలు చేసేందుకు కార్యాచరణ ప్రణాళిక

ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి : యాదాద్రి భువనగిరి జిల్లాలో నవజాత శిశు మరణాల రేటును గణనీయంగా తగ్గించి, సింగిల్ డిజిట్‌కు తీసుకురావడమే లక్ష్యంగా 'సంకల్ప్' కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, అధికారులను ఆదేశించారు.గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన 'సంకల్ప్' కార్యక్రమం అమలుపై నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో కలెక్టర్ పాల్గొని, సంబంధిత వైద్యాధికారులతో చర్చించారు. గతంలో ఆదిలాబాద్ జిల్లాలో ఎయిమ్స్ ప్రొఫెసర్ డాక్టర్



తణిగైనాథన్ ఆధ్వర్యంలో విజయవంతంగా అమలు చేసిన 'సంకల్ప్' కార్యక్రమం అనుభవాలను యాదాద్రి భువనగిరి జిల్లాలోనూ వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. బీబీనగర్ ఎయిమ్స్ సహకారంతో జిల్లాలో ఈ కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు చర్యలు చేపట్టాలని తెలిపారు.ఈ సమావేశంలో ఎయిమ్స్ ప్రొఫెసర్ డాక్టర్ తణిగైనాథన్ ప్రత్యేక సెషన్ నిర్వహించి, ఆదిలాబాద్ జిల్లాలో కార్యక్రమం అమలు చేసిన విధానం, సాధించిన ఫలితాలు, నవజాత శిశు మరణాల నివారణకు అనుసరించాల్సిన పద్ధతులు, జిల్లాలో అమలు చేయాల్సిన కార్యాచరణ ప్రణాళికపై వివరించారు.ఈ కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ సూర్యశ్రీ రావు, ఏహెచ్ రామన్నపేట మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, సీహెచ్‌సీ ఆలేరు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ జె. స్వప్న రాథోడ్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి యాదాద్రి పీడియాట్రిక్స్ ప్రొఫెసర్ డాక్టర్ కవిత, డీఎంహెచ్ఓ డాక్టర్ మనోహర్ పాల్గొన్నారు.

పోరాటం అద్భుతం..



జిల్లా కీర్తి ప్రతిష్టలను పెంచిన ఎస్డి ఆర్ ఎఫ్, ఎన్ డి ఆర్ ఎఫ్, ఫైర్ సిబ్బంది
మంత్రి తుమ్మల

ముద్ర ప్రతినిధి, ఖమ్మం, నవంబరు 5 : బేతుపల్లి చెరువులో ఎదురైన ప్రమాదకర పరిస్థితుల్లో ప్రాణాలకు తెగించి మత్స్యకారులను, ఎస్ డి ఆర్ ఎఫ్ సిబ్బందిని కాపాడిన సహాయక బృందాల సాహసానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జేజేలు పలికారు. సత్తుపల్లి పట్టణంలోని అటవీ శాఖ కార్యాలయ గెస్ట్ హౌస్‌లో ఎన్ డి ఆర్ ఎఫ్, ఎస్ డి ఆర్ ఎఫ్ , ఫైర్ సిబ్బందికి మంత్రి తుమ్మల ప్రత్యేక అభినందన సభ ఏర్పాటు చేసి, వారిని ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. ప్రాణాలను సైతం లెక్కచేయకుండా చిమ్మ చీకటిలో ధైర్యంగా పోరాడి 16 మందిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చిన సహాయక సిబ్బంది పోరాట పటిమ అమూల్యమైనదని కొనియాడారు. "మీ పోరాటం అద్భుతం.. జిల్లా కీర్తి ప్రతిష్టలను నిలబెట్టారు. మీ రుణం తీర్చుకోలేనిది. 16 మంది ప్రాణాలను కాపాడిన మీకు రాష్ట్ర ప్రభుత్వం తరపున, ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజల తరపున నా హృదయపూర్వక ధన్యవాదాలు" అని భావోద్వేగంతో ప్రసంగించారు.నిన్నటి నుంచి స్థానికంగానే ఉంటూ సహాయక చర్యలను దగ్గరుండి పర్యవేక్షించిన సత్తుపల్లి శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ విజయకుమార్‌ను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. రాత్రంతా పర్యవేక్షణ కొనసాగించిన ఉమ్మడి ఖమ్మం జిల్లా అధికారుల పనితీరును ప్రశంసించారు. ప్రమాద సమయంలో పరిసర గ్రామాల ప్రజలు, పార్టీ యంత్రాంగం అందించిన సహాయ సహకారాలు ఎంతో మెచ్చుకోదగినవని, వారికి మంత్రి తుమ్మల తన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కలెక్టర్ ను ఆలింగనం చేసుకున్న మంత్రి తుమ్మల



బేతుపల్లి చెరువు వద్ద చోటుచేసుకున్న ఉత్కంఠభరిత ఘటనలో అధికార యంత్రాంగం ప్రదర్శించిన ధైర్యసాహసాలు, సమర్థవంతమైన సమన్వయం అందరి మన్ననలను పొందాయి. ప్రాణాలను సైతం లెక్కచేయకుండా చేపట్టిన ఈ సాహసోపేతమైన రక్షణ చర్యలు పూర్తిగా విజయవంతం కావడంతో రాష్ట్ర మంత్రి తుమ్మల జిల్లా కలెక్టర్ దివాకర్‌ను ఆప్యాయంగా అలింగనం చేసుకొని ప్రత్యేకంగా అభినందించారు.ఆపద సమయంలో జిల్లా యంత్రాంగం చూపిన అప్రమత్తత, అధికారులు సమన్వయంతో వ్యవహరించిన తీరు, బాధ్యతాయుతమైన పనితీరు ఎంతో స్ఫూర్తిదాయకమని మంత్రి కొనియాడారు. క్లిష్ట పరిస్థితుల్లోనూ అధికారులు చూపిన తెగువ పలువురి ప్రాణాలను కాపాడటంలో కీలకపాత్ర పోషించిందని హర్షం వ్యక్తం చేశారు.

మురసు బాధిత రైతాంగాన్ని ఆదుకోవాలి



ముద్ర ప్రతినిధి, ఖమ్మం, నవంబరు 5 : మురసు తుఫాన్ కారణంగా సర్వం కోల్పోయిన బాధిత రైతాంగాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం వెంటనే సహాయక చర్యలు ప్రారంభించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు, సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు డిమాండ్ చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మురసు తుఫాన్ రైతాంగాన్ని కోలుకోలేని విధంగా దెబ్బతీసిందని పేర్కొంటూ ఒక ప్రకటన విడుదల చేశారు.సత్తుపల్లి, అశ్వారావుపేట, పెనుబల్లి, కల్లూరు, దమ్మపేట, తల్లాడ, సుజాతనగర్, పాల్వంచ, కొణిజర్ల తదితర మండలాల్లో రైతాంగానికి తీవ్ర నష్టం వాటిల్లిందని తెలిపారు. ముఖ్యంగా చేతికి వచ్చిన వరి పంట భారీ వర్షాలకు నేలకొరిగిందని, వరితో పాటు ఇతర వాణిజ్య పంటలు కూడా పూర్తిగా దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తుఫాన్ ప్రభావిత మండలాల్లో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గ్రామాల వారీగా పంట నష్టాన్ని అంచనా వేయడానికి సమగ్ర సర్వే నిర్వహించాలని కోరారు.ఒకవైపు ఎల్ నినో ప్రభావంతో వర్షాలు లేక రైతులు అనేక కష్టనష్టాలకోర్చి ఈ ఏడాది పంటలను సాగు చేశారని, చేతికి వచ్చే సమయంలో మురసు తుఫాన్ నోటికాడ ముద్దను లాగేసుకుందని హేమంతరావు ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపోయిన వరి పంటకు ఎకరానికి 30 వేల రూపాయలు, వాణిజ్య పంటలకు ఎకరానికి 50 వేల రూపాయల చొప్పున పరిహారం అందించాలని, తుఫాన్ వల్ల నష్టపోయిన పేద కుటుంబాలకు కూడా తక్షణ సాయం అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇంతటి విపత్తు సమయంలో ప్రభుత్వం ఉదాసీన వైఖరి వీడి, వెంటనే పరిహారం ప్రకటించి రైతాంగానికి ధైర్యం చెప్పాలని పేర్కొన్నారు.

బీబీనగర్ లో మహాసభల జయప్రదం కోసం బైక్ ర్యాలీ



ముద్ర, బీబీనగర్ : పోరాటాల పురిటిగడ్డ నల్గొండ జిల్లా కేంద్రంలో నవంబర్ 15 నుంచి 18 వరకు నిర్వహించనున్న అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) 36వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలిని గురువారం బీబీనగర్ పట్టణ కేంద్రంలో సిపిఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో బ్రాహ్మణపల్లి రోడ్డు చౌరస్తా సెంటర్ నుండి పోచంపల్లి చౌరస్తా సెంటర్ వరకు బైకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ మండల కార్యదర్శి శ్రావణ్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 1.58 కోట్లకు పైగా సభ్యత్వంతో అఖిల భారత కిసాన్ సభ ప్రపంచంలోనే అతిపెద్ద రైతాంగ ఉద్యమ సంస్థగా కొనసాగుతోందన్నారు. సామ్రాజ్యవాదం, భూస్వామ్యానికి వ్యతిరేకం గా సాగిన చారిత్రాత్మక పోరాటాల వార సత్వాన్ని కొనసాగిస్తూ రైతాంగ హక్కుల కోసం నిరంతరం పోరాడుతోందని తెలి పారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం, తెభాగా, వర్లీ ఆదివాసీ, పున్నప్ర-వయలార్, సుర్మా లోయ రైతాంగ పోరాటాల స్ఫూర్తితో నయా ఉదారవాద ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలను నిర్మిస్తోం దన్నారు. దేశవ్యాప్తంగా రైతులను సంఘటితం చేసి వారి సమస్యల పరిష్కారం కోసం అఖిల భారత కిసాన్ సభ నిరంతరం కృషి చేస్తోందని వివరించారు. . నవంబర్ 15 నుంచి 18 వరకు జరిగే 36వ అఖిల భారత జాతీయ మహాసభలకు దేశం నలుమూలల నుంచి 950 మందికి పైగా ప్రతినిధులు, పరిశీలకులు, నాయకులు హాజరుకానున్నారని తెలిపారు. నవంబర్ 15 నుంచి 18 వరకు జరిగే ఈ మహాసభలు రైతాంగ సమస్యలు, వ్యవసాయ రంగ భవిష్యత్తు, రైతుల హక్కుల పరిరక్షణకు సంబంధించిన అంశాలపై దేశవ్యాప్త చర్చకు కీలక వేదికగా నిలవనున్నాయన్నారు. అన్నదాతను కాపాడటం అంటే దేశాన్ని కాపాడటమేనని, శ్రమజీవుల హక్కులను పరిరక్షించకుండా సమానత్వంతో కూడిన అభివృద్ధి సాధ్యం కాదని స్పష్టం చేశారు. సిపిఎం పట్టణ కార్యదర్శి బండారు శ్రీరాములు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి గాడిశ్రీనివాస్, ఓవల్ దాస్ సతీష్, కుమ్మరి రాజు, ఓవల్ దాస్ హరికృష్ణ, చెట్టబోయిన కనకయ్య, ఓవర్ దాస్ కొండల్, సోముల బస్వా రెడ్డి, తోకల రఘుపతి, తొర్రి యాదగిరి, బానోతు రవి నాయక్, పాండు, నారాయణ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు అమూల్యమైనవి

ముద్ర ప్రతినిధి, ఖమ్మం, నవంబరు 5 : మున్నూరు కాపు హాస్టల్‌లో నగర అధ్యక్షుడు రాపర్తి శరత్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సన్నాహక సమావేశంలో తెలంగాణ మున్నూరు కాపు పటేల్స్ సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా శెట్టి రంగారావు, ప్రధాన కార్యదర్శిగా గోవింద్ శ్రీనివాసరావు, కోశాధికారిగా మాదంశెట్టి హనుమంతరావు ఎన్నికయ్యారు. సీనియర్ నాయకులు, ట్రస్ట్ బోర్డు ప్రతినిధులు ముఖ్య అతిథులుగా హాజరైన ఈ సమావేశంలో నూతన అధ్యక్షుడు శెట్టి రంగారావు మాట్లాడుతూ కుల బంధువులందరినీ కలుపుకొని సంఘ సభ్యత్వాలను విస్తృతం చేస్తామని



తెలిపారు. రాజకీయాలకు అతీతంగా మున్నూరు కాపుల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తామని, పేద విద్యార్థులు, నిరుపేద కుటుంబాలకు సంఘం అండగా ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు సంఘ నాయకులు, ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జూడో చాంపియన్షిప్ పోటీలలో జీనియస్ విద్యార్థులకు పతకాలు

ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి : యాదాద్రి భువనగిరి డిస్ట్రిక్ట్ జూడో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 3న బీబీనగర్ లోని పి ఆర్ జి ఫంక్షన్ హాల్లో నిర్వహించిన జిల్లాస్థాయి జూడో చాంపియన్ షిప్ పోటీలో జీనియస్ హై స్కూల్ విద్యార్థులు పథకాలు గెలుపొందారు. గెలుపొందిన క్రీడాకారులను పాఠశాల ప్రిన్సిపల్ వి. సుచరిత పాఠశాలలో అభినందిస్తూ క్రీడాకారులకు మెడల్స్, సర్టిఫికెట్స్ ను అందజేస్తూ చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని క్రీడలు ఆడటం వలన



విద్యార్థులలో క్రమశిక్షణతో పాటు పట్టుదల శరీరక దృఢత్వం ఏర్పడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో జి రవి, పి ఈ టి లు కే శ్రీకాంత్, కే కృష్ణ కుమార్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు

పారిశుద్ధ్య కార్మికుల సేవలు అమూల్యమైనవి

చైర్ పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్

ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి : పట్టణ పరిశుభ్రత కోసం రేయింబవళ్లు శ్రమిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సేవలు అమూల్యమైనవని, వారి ఆరోగ్యం, సంక్షేమం కోసం పురపాలక సంఘం ఎల్లప్పుడూ ముందుంటుందని చైర్ పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ అన్నారు. గురువారం 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను పారిశుద్ధ్య విభాగంలో పనిచేస్తున్న ప్రతి కార్మికునికి పంపిణీ చేయవలసిన సబ్బులు, నూనె పంపిణీ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ప్రతిరోజూ చెత్త, మురుగుతో పనిచేసే కార్మికులకు ఈ సబ్బులు, నూనె ఎంతో అవసరమని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో గౌరవ వైస్ చైర్ పర్సన్ పోతంశెట్టి మంజుల వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ కే. చంద్ర ప్రకాష్ రెడ్డి, గౌరవ కౌన్సిలర్లు తాహెరా బాబు మజర్ పాషా, పోలిశెట్టి అనిల్ కుమార్, పాశం అమర్ నాథ్, పచ్చల జగన్ మోహన్, బర్రె సంఘవి కరుణాకర్, మున్సిపల్ ఇంజనీర్, శానిటరీ ఇన్ స్పెక్టర్, జవాన్లు సిబ్బంది పాల్గొన్నారు.



మోటకొండూరు ఠాణాను ఆకస్మిక తనిఖీ చేసిన ఎస్పీ

ముద్ర, మోటకొండూర్: యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ మోటకొండూరు పోలీస్ స్టేషన్‌ను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భం గా పోలీస్ స్టేషన్‌లోని వివిధ రికార్డులు, రిజిస్టర్లు, కేసుల వివరాలు, పోలీస్ శాఖలోని వివిధ విభాగాల (వెర్టికల్స్) పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతి, పోలీస్ స్టేషన్ నిర్వహణ, సిబ్బంది విధుల నిర్వహణ పై సమీక్షించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడి వారి విధులు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించడంతో పాటు, సాంకేతిక



పరి జ్ఞానాన్ని వినియోగించుకుంటూ నేరాల నియంత్రణకు సమర్థవంతంగా కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఎస్ఎచ్ఓ కుమారస్వామి, ఏఎస్ఐ ప్రకాష్ పోలీస్ సిబ్బంది హాజరయ్యారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శుక్రవారం 06.11.2026
www.mudranews.in | @mudranews

గుండెకు మేలు చేసే నూనెలను ఎంచుకోండి



ఆలివ్ ఆయిల్, వేరుశెనగ నూనె, సన్‌ఫ్లవర్, సోయాబీన్, కనోలా నూనెల్లో అసంతృప్త కొవ్వులు ఉంటాయి. సంతృప్త కొవ్వులకు బదులుగా వీటిని పరిమితంగా ఉపయోగించడం వల్ల చెడు కొలెస్ట్రాల్ (LDL) తగ్గించుకోవడంలో సహాయపడవచ్చు.

పిల్లలను అనాథలుగా వదిలేయకండి

ముద్ర ప్రతినిధి, మెదక్:పిల్లలను అనాథలుగా వదిలేయకండి...మీకు మేమున్నాం, ప్రతి బిడ్డ బాధ్యత ప్రభుత్వానిదే అని కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. పిల్లల సంరక్షణపై మాట్లాడారు.. మెదక్ జిల్లాలో అనాథగా లేదా అవాంఛితంగా మారిన శిశువులను నడిరోడ్డుపై, చెత్తకుప్పల్లో లేదా నిర్మానుష్య ప్రాంతాల్లో వదిలివేయకుండా, ప్రభుత్వ రక్షణ కేంద్రాలకు అప్పగించాలని సూచించారు. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యలు, సామాజిక ఒత్తిళ్లు, వివాహేతర సంబంధాల కారణంగా పుట్టిన పిల్లలు కావడం లేదా ఇతర వ్యక్తిగత కారణాల వల్ల పిల్లలను పెంచలేని పరిస్థితి ఏర్పడినా, దయచేసి బిడ్డను వదిలివేయడం, రహస్య ప్రదేశాల్లో విడిచిపెట్టడం, చెత్తకుప్పల్లో పడేయడం లేదా ఇతరులకు అక్రమంగా అప్పగించడం వంటి చర్యలకు పాల్పడకండని తెలిపారు.



తల్లిదండ్రులు లేదా కుటుంబ సభ్యులు బిడ్డను పెంచలేని పరిస్థితుల్లో ఉంటే, మహిళా, శిశు సంక్షేమ శాఖను సంప్రదిస్తే శాఖ తరపున అవసరమైన సహాయం, రక్షణ, సహాయక చర్యలు తీసుకుంటామన్నారు.వివాహేతర సంబంధాల వల్ల జన్మించిన పిల్లల విషయంలో కూడా ఎటువంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదు. తల్లిదండ్రుల వ్యక్తిగత పరిస్థితులు, సామాజిక నేపథ్యం వంటి అంశాలను గౌరవిస్తూ, చట్టబద్ధమైన విధానాల ప్రకారం బిడ్డకు రక్షణ, సంరక్షణ కల్పిస్తాము. సమాచారం గోప్యంగా, గౌరవప్రదంగా నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. బిడ్డను పెంచలేని వారు శాఖను సంప్రదిస్తే, చట్టబద్ధమైన ప్రక్రియ ద్వారా శిశు గృహాలు, ప్రత్యేక దత్తత సంస్థలు సంబంధిత బాలల సంరక్షణ వ్యవస్థల ద్వారా అవసరమైన ఏర్పాట్లు చేస్తామన్నారు. బిడ్డకు ఆహారం, వసతి, వైద్యం, విద్య, భద్రతతో పాటు భవిష్యత్తులో చట్టబద్ధమైన దత్తత అవకాశాలను కూడా పరిశీలిస్తామని సూచించారు.

అన్ని శాఖల్లో ఈ-హెచ్ఆర్ఎంఎస్ విధానం





అదనపు కలెక్టర్ నగేష్

ముద్ర ప్రతినిధి, మెదక్: ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నూతన ఈ-హెచ్ఆర్ఎంఎస్ విధానాన్ని అన్ని శాఖల్లో సమర్థవంతంగా అమలు చేసేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని అదనపు కలెక్టర్ నగేష్ తెలిపారు.ప్రభుత్వ ఉద్యోగుల సర్వీసు రికార్డులు, వ్యక్తిగత వివరాలు, సేవా సంబంధిత కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రవేశపెడుతున్న నూతన ఈ-హెచ్ఆర్ఎంఎస్ విధానంపై గురువారం ఐడీఓసీలో అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుతం అమలులో ఉన్న హెచ్ఆర్ఎంఎస్ విధానం స్థానంలో ప్రవేశపెడుతున్న నూతన ఈ-హెచ్ఆర్ఎంఎస్ విధానానికి మార్పు, సాఫ్ట్‌వేర్‌లో ఉద్యోగుల వ్యక్తిగత, సర్వీసు వివరాల నమోదు, వివిధ పరిపాలనా ప్రక్రియలు, సాఫ్ట్‌వేర్ వినియోగ విధానం, అందుబాటులో ఉండే సదుపాయాలపై అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇచ్చారు.అదనపు కలెక్టర్ నగేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మెదక్ జిల్లా ఖజానా శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అనిల్ కుమార్ నూతన విధానం అమలుకు సంబంధించిన అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా ట్రెజరీ అసిస్టెంట్ డైరెక్టర్ అనిల్ కుమార్, ఏటీఓ కార్తీక్, ఎస్టిఓలు టి. శ్రీనివాస్, నాగరాణి, ప్రసాద్, అన్ని శాఖల జిల్లా అధికారులు, డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.పారదర్శకంగా భూముల రీ సర్వే...భూముల రీ సర్వే పారదర్శకంగా పూర్తిచేయాలని అదనపు కలెక్టర్ నగేష్ ఆదేశించారు.కలెక్టరేట్ లో జిల్లా సర్వే అండ్ లాండ్ రికార్డ్స్ అధికారి ఏడీ కిషన్ ఆధ్వర్యంలో భూముల రీ సర్వే ప్రక్రియపై లైసెన్స్ సర్వేయర్లకు సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. అదనపు కలెక్టర్ నగేష్ పలు కీలక సూచనలు చేశారు.ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూముల రీ-సర్వే ప్రక్రియను ఎలాంటి అవినీతికి తావులేకుండా, అత్యంత పారదర్శకంగా పూర్తి చేయాలని లైసెన్స్ సర్వేయర్లను ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే సర్వే, హద్దుల గుర్తింపు దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి. విధులో నిర్లక్ష్యం వహించినా, భూముల రీ-సర్వేలో అలసత్వం చూపినా లైసెన్సులను రద్దు చేయడంతో పాటు కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.సర్వే ప్రక్రియలో ఆధునిక సాంకేతిక పరికరాలైన డీజీపీఎస్, రోవర్లు, టోటల్ స్టేషన్లను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. సర్వే పేరుతో రైతులను, సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేయకూడదని, నిబంధనల ప్రకారం ప్రభుత్వం నిర్దేశించిన సేవా రుసుములను మాత్రమే వసూలు చేయాలని స్పష్టం చేశారు. తహసీల్దార్లు, మండల సర్వేయర్లు, లైసెన్స్ సర్వేయర్లు పరస్పర సమన్వయంతో క్షేత్రస్థాయిలో పెండింగ్‌లో ఉన్న భూ వివాదాల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

కూకట్‌పల్లిలో అక్రమ నిర్మాణాల జోరు


కేపీహెచ్‌బీ 9వ ఫేజ్‌లో నిబంధనలకు తూట్లు..
ఎంఐజీ 114 వద్ద అదనపు అంతస్తుల నిర్మాణంపై ఆరోపణలు

ముద్ర, కూకట్‌పల్లి: నగరంలో భవన నిర్మాణ నిబంధనలు అమలవుతున్నాయా? లేక బడాబాబుల ఇష్టారాజ్యమే చట్టంగా మారిందా? అనే ప్రశ్నలు కూకట్‌పల్లి ప్రాంతంలో తలెత్తుతున్నాయి. కేపీహెచ్‌బీ 9వ ఫేజ్‌లోని ఎంఐజీ 114 వద్ద జరుగుతున్న ఓ భవన నిర్మాణం ఇప్పుడు స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.స్థానికుల ఆరోపణల ప్రకారం, సదరు నిర్మాణదారుడు మున్సిపల్ అధికారుల నుంచి కేవలం రెండు అంతస్తులకు మాత్రమే అనుమతులు పొందినప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం అదనపు అంతస్తులు నిర్మిస్తున్నట్లు తెలుస్తోంది. అనుమతులకు విరుద్ధంగా నిర్మాణం జరుగుతున్నా సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారులు ఎందుకు స్పందించడం లేదనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.అధికారుల పర్యవేక్షణ ఎక్కడ?నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నప్పుడు వాటిని గుర్తించి చర్యలు తీసుకోవాల్సిన టౌన్ ప్లానింగ్ విభాగం మౌనం వహించడంపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యమా? లేక అక్రమ నిర్మాణాలకు తెరవెనుక సహకారం అందుతోందా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు స్పందించి వాస్తవాలను వెల్లడించాల్సిన అవసరం ఉంది.భవిష్యత్తులో ప్రజా భద్రతకు ముప్పు!అనుమతులకు మించి అంతస్తుల నిర్మాణం చేపడితే భవనం నిర్మాణ భద్రతతో పాటు పార్కింగ్, డ్రైనేజీ, నీటి సరఫరా, రహదారులపై కూడా తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. పెరుగుతున్న అక్రమ నిర్మాణాలను నియంత్రించకపోతే భవిష్యత్తులో స్థానిక మౌలిక వసతులపై అదనపు భారం పడుతుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఉన్న తాధికారులు తక్షణమే స్పందించాలి ఎంఐజీ 114 వద్ద జరుగుతున్న నిర్మాణంపై సమగ్ర విచారణ చేపట్టి, మంజూరైన భవన నిర్మాణ అనుమతులు, ప్రస్తుత నిర్మాణ స్థితిని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం జరుగుతున్నట్లు నిర్ధారణ అయితే చట్టప్రకారం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేసి, బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు సంబంధిత అధికారుల పాత్రపైనా విచారణ జరపాలని కూకట్‌పల్లి వాసులు కోరుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపుతారా? లేక చూసీచూడనట్లు వ్యవహరిస్తారా? అన్నది వేచి చూడాలి



ఎంబిబిఎస్ విద్యార్థికి ఎమ్మెల్యే ఆర్థికసాయం

ముద్ర, వనపర్తి : నాగర్ కర్నూలు జిల్లా మెడికల్ కాలేజీలో ఎంబిబిఎస్ నాలుగో సంవత్సరం చదువుతున్న వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం గుమ్మడం తండాకు చెందిన నాగమ్మ, రవీందర్ల కుమారుడు శశిధర్ కు వనపర్తి శాసనసభ్యులు గౌరవ శ్రీ తూడి మేఘారెడ్డి గారు గురువారం రూ.15 వేల ఆర్థికసాయం అందించారు. హాస్టల్లో ఉండేందుకు మెస్కు సంబంధించి ఆర్థిక ఇబ్బంది ఉందని విద్యార్థి ఎమ్మెల్యే గారి దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించిన ఆయన ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో రవీంద్ర నాయుడు, గంధం రాజశేఖర్, నరసింహ నాయుడు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



కనుల పండువగా తిరుప్పావడ సేవ



ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి : స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దివ్యక్షేత్రంలో గురువారం ఏకాదశిని పురస్కరించుకొని శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి ప్రాతఃకాలంలో అర్చక స్వాములు నవ కలుశ పంచామృత అభిషేకాన్ని నిర్వహించారు. క్షేత్రంలో సకల ప్రాణికోటికి ఆహార కొరత లేకుండా ఉండడం స్వామివారికి జరిపే అన్నకూటోత్సవాన్నే తిరుప్పావడ అంటారు. ప్రతి గురువారం నైవేద్య సమయంలో తిరుప్పావడ జరుగుతుంది.అప్పుడు సుమారు 450 కిలోల అన్నప్రసాదాన్ని,లడ్డు,వడ,తదితర పిండివంటలను శ్రీవారికి నైవేద్యం చేస్తారు.వేదమంత్రోచ్చారణలతో అర్చించి కర్పూరమంగళ హారతులు సమర్పించారు.

ఐక్యత తోనే బిసి ల హక్కుల సాధన

ముద్ర ప్రతినిధి, ఖమ్మం, నవంబరు 5 : ఐక్యతతోనే బిసిలు తమ హక్కులను సాధించుకోగలరని, జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు దక్కించుకోవడానికి బిసి హక్కుల సాధన కోసం అందరూ ఐక్యం కావాలని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ పిలుపునిచ్చారు. సిపిఐ కార్యాలయంలో పీట్ల కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన బిసి హక్కుల సాధన సమితి ఖమ్మం నగర మహాసభకు దండి సురేష్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.దేశంలో సంపదను సృష్టించే శ్రమజీవులకు రాజకీయ పాలనలోనూ, సంపద పంపిణీలోనూ సరైన వాటా దక్కడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బిసిలలో ఉన్న అనైక్యతను ఆసరాగా చేసుకుని కొన్ని శక్తులు విభజించి పాలిస్తున్నాయని, నిరంతర పోరాటాల ద్వారానే రిజర్వేషన్లు, హక్కుల సాధన సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వెనుకబడిన తరగతులు చైతన్యవంతమైన ఆలోచనలతో ఉద్యమించాలని సూచించారు. ప్రస్తుత పాలకులు ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని, ఒకవైపు కరువు, మరోవైపు అతివృష్టితో ప్రజలు అతలాకుతలమవుతున్నా ప్రభుత్వం స్థానిక పరిస్థితులకు అనుగుణంగా చర్యలు చేపట్టడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు.అనంతరం బిసి హక్కుల సాధన సమితి నగర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షునిగా పీట్ల కృష్ణమూర్తి, అధ్యక్షుడిగా సిద్ది శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా బొర్రా వీరబాబులతో పాటు మరో 17 మందిని కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బిసి హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షుడు మేకల శ్రీనివాసరావు, కార్యదర్శి తాటి వెంకటేశ్వరరావు, సిపిఐ నగర కార్యదర్శి ఎస్కె జానిమియా, నాయకులు తోట రామాంజనేయులు, పగడాల మల్లేష్, ఏనుగు గాంధీ, వై. సాంబశివారెడ్డి, వరదా నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

956 గ్రాముల ఎండు గంజాయి స్వాధీనం



ముద్ర ప్రతినిధి, మెదక్: కాళ్లకల్ గ్రామంలోని కెవల్ఆర్ గ్రీన్ విహార్ వెంచర్ లో తనిఖీలు నిర్వహించగా అక్రమంగా గంజాయిని కలిగి ఉన్నట్లు గుర్తించి 956 గ్రాముల ఎండు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు బీహార్ కు చెందిన జ్యోతిష్ కుమార్ గా గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ సిఐ గోపాల్ తెలిపారు. స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితుడిని తదుపరి చర్యల నిమిత్తం నర్సాపూర్ స్టేషన్ కు అప్పగించడం జరిగిందన్నారు.

నీటి కొరత పేరుతో జూనియర్ కళాశాలల మూసివేతపై సమగ్ర విచారణ చేపట్టాలి



విద్యార్థుల సమస్యలను బోర్డు దృష్టికి తీసుకెళ్లిన ఎస్ పి ఎఫ్

ముద్ర, కూకట్‌పల్లి : నగరంలో నీటి కొరత నెపంతో పలు ప్రైవేట్ ఇంటర్మీడియట్ కళాశాలలను మూసివేయడంపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులైన యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్టూడెంట్స్ ప్రొటెక్షన్ ఫోరం (SPF) తెలంగాణ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి శ్రీమతి అభిలాష అభినవ్, ఐ ఏ ఎస్ , కి ఎస్ పి ఎఫ్ , బృందం వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా అధ్యక్షుడు రాహుల్ నాయక్ మాట్లాడుతూ... ప్రభుత్వ అనుమతి లేదా బోర్డుకు సమాచారం లేకుండా కళాశాలలను ఎలా నిలిపివేస్తారని ప్రశ్నించారు. సెలవు దినాల్లో సైతం తరగతులు నిర్వహించే యాజమాన్యాలు, నీటి కొరత నెపంతో విద్యాబోధనను నిలిపివేయడం సరికాదన్నారు. పరిమితికి మించి అడ్మిషన్లు చేపడుతున్నారా లేదా అనే దానిపై క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి, మౌలిక సదుపాయాలు మరియు గుర్తింపు ఉన్న కళాశాలల వివరాలను తేల్చాలని కోరారు.ఎస్ పి ఎఫ్ వినతిపై బోర్డు కార్యదర్శి సానుకూలంగా స్పందించారు. ప్రతి తరగతి గదిలో విద్యార్థుల సంఖ్యను 40కి పరిమితం చేసే నిబంధనను అమలు చేస్తున్నామని తెలిపారు. అనుమతులు లేకుండా నిర్వహించే కళాశాలలకు గరిష్ఠంగా రూ.1 కోటి వరకు జరిమానా విధించే అవకాశం ఉందని, ఇటీవల నిబంధనలు ఉల్లంఘించిన సంస్థల నుంచి రూ.10 కోట్ల మేర జరిమానా వసూలు చేసినట్లు వెల్లడించారు.విద్యార్థులకు కనీస తాగునీరు, పారిశుద్ధ్య సదుపాయాలు కల్పించని కళాశాలలపై చర్యలు తీసుకోవాలని నేతలు కోరారు. విద్యార్థుల విద్యా సంవత్సరం దెబ్బతినకుండా ప్రభుత్వం తక్షణమే శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు తనుజ్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లిలో కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు



ముద్ర, కూకట్‌పల్లి : ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించిన 'ఓటు బచావో – దేశ్ బచావో' కార్యక్రమాన్ని విజయవంతం చేసి తిరిగి వచ్చిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లను అభినందిస్తూ గురువారం కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం (శ్రీ హేమదుర్గ భవన్)లో విజయోత్సవ సంబరాలు నిర్వహించారు.టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ... ఢిల్లీలో జరిగిన 'ఓటు బచావో – దేశ్ బచావో' మహాధర్నాకు కూకట్‌పల్లి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో బస్సుల ద్వారా తరలివెళ్లి సభను దిగ్విజయం చేయడం అభినందనీయమన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా ముందుకు సాగడం గర్వకారణమని పేర్కొన్నారు. సభ విజయవంతానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. భవిష్యత్తులో కూడా పార్టీ చేపట్టే ప్రజాపోరాటాల్లో కార్యకర్తలు ఇదే ఉత్సాహంతో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L.N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H.No. 7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg.No.TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555